Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 12.08.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 10 పేజీలు : 12, వెల : ₹ 5


ISO 9001-2008 CERTIFIED HOSPITAL
Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
CARE SUPER SPECIALITY DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

శుభాకాంక్షలు
పాఠకులకు, ప్రకటనకర్తలకు, చందాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు
సం/-



# పుష్కలంగా అవినీతి!

> ఆరంభం కాకముందే తేలిపోయిన నిర్మాణాలు

> తమ్ముళ్లకు కట్టబెట్టడానికే అదరాబదరా పనులు

**పుష్కరాలు... తరతరాలుగా వస్తున్న సంప్రదాయ సంబరాలు. ప్రకృతిని పూజించే హైందవ సంస్కృతి ప్రతీకలు. భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూనో, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరు ప్రకాశం పంతులో కనిపెట్టినవి కావు. మన ఋషులు, ఆధ్యాత్మిక వేత్తలు, పూర్వీకులు మనకు వారసత్వంగా ఇచ్చిన సంప్రదాయ వేడుకలు.**

మరిప్పుడు కృష్ణా పుష్కరాల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న హడావిడి చూస్తుంటే పుష్కరాలను కూడా ఆయనే కనిపెట్టాడేమోననిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌కు కంప్యూటర్లు నేనే తెచ్చాను, సెల్‌ఫోన్‌లు నేనే తెచ్చానని ఆయన చెప్పుకుంటుంటాడు. ఆ విధంగా పుష్కరాలను నేనే తెచ్చానని చెప్పుకునే అవకాశమైతే లేదు గాని, పుష్కరాలను కూడా ఒక రాజకీయ జాతరగా మార్చిన ఖ్యాతి మాత్రం ఆయనదేనని చెప్పుకోవచ్చు.

ఏడాది క్రితం గోదావరి పుష్కరాల సందర్భంగా ఆయన చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. పుష్కరాలు జరిగే 12రోజులు ముఖ్యమంత్రే అక్కడ ఉండడం ఎప్పుడూ జరగలేదు. దీనిని బట్టి ఏపి సీఎం పని లేక (మిగతా 11వ పేజీలో)

# డబ్బులోనే కాదు... గబ్బులోనూ నెం.1



*నెంబర్ 1... ఏ రంగంలో ఉన్నవారైనా కోరుకునే స్థానం. పారిశ్రామిక రంగంలో నెంబర్ వన్ కావాలని, సినీ పరిశ్రమలో నెంబర్ వన్ హీరోయిన్ కావాలని, ఐసిసి క్రికెట్ ర్యాంకింగ్స్‌లో నెంబర్.1 స్థానాన్ని చేజిక్కించుకోవాలని... ఇలా ఏ రంగంలో వున్నవారు ఆ రంగంలో నెంబర్.1 స్థానాన్ని కోరుకుంటుంటారు. అలాంటి నెం.1 స్థానమే మన నెల్లూరుజిల్లాకు చెందిన మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణకు దక్కింది.* (మిగతా 11వ పేజీలో)

# పంథా మార్చిన జగన్



12లో

Knee Clinic
Now @ Anna Nagar




With Best Compliments from
M.Ramalinga Reddy, Nellore
I.Srinivasulu Reddy, Pottepalem

Sunway MEDICAL CENTRE
GIVING JOY OF MOVEMENT
Dr.M.Madan Mohan Reddy
MS(Ortho)., F.R.C.S.(UK)., MD(France).
Knee Replacement & Arthroscopy Surgeon
Senior Consultant

Consultation
X-Ray
Physiotherapy
Rehabilitation
Dexa Scan (BMD)

Stemcell Therapy
Regenerative Therapy
Arthroscopic surgery
Knee Replacement

Consultation by Appointment Only
AH.37/39, SHANTHI COLONY MAIN ROAD, ANNA NAGAR, CHENNAI-40.
E-mail : drmadanmohan.ortho@gmail.com, sunwaymedicalcentre.chennai@gmail.com
For Appointments Contact : 044 -43589580, 044 - 26213166, 07092484166

## సీనియర్ సిటిజన్లకు
# ఏ కార్డయినా ఓకే!

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే సమయంలో 60ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్లకు అన్ని రకాల కార్డులు వయస్సు నిర్ధారణకు వర్తిస్తాయని నెల్లూరు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రవివర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జూలై నుంచి ప్రవేశపెట్టిన ఆర్టీసీ ఛార్జీలు సీనియర్ సిటిజన్లకు 25 శాతం రాయితీని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అయితే ప్రయాణీకుల్లో, సిబ్బందిలో ప్రయాణ సమయంలో ఆధార్‌కార్డు మాత్రమే ఉండాలన్న అపోహ ఉందని, ఆధార్ లేకున్నా రేషన్‌కార్డు, పాన్‌కార్డు, పాస్‌పోర్టు, ఓటరు కార్డు వంటివి ఏది వున్నా 25 శాతం రాయితీ లభిస్తుందని, ఏసి బస్సుల్లో సైతం సీనియర్ సిటిజన్లు ప్రభుత్వ పథకాన్ని ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

## నేత్రపర్వంగా
# కామాక్షమ్మ కళ్యాణోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ గ్రామంలో వెలసివున్న శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి నిత్య కళ్యాణోత్సవం ఈ నెల 7న అర్చకులు కన్నులపండువగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, అనంతరం స్వామివారికి, అమ్మవార్లకు అభిషేక సేవలు నిర్వహించి, ఆలయ మండపంలో కొలువుదీర్చి కళ్యాణోత్సవం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు.

## క్షయవ్యాధి నివారణకు
# అవగాహన సదస్సులు

నాయుడుపేటలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 7న క్షయవ్యాధి నివారణ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ అవగాహన సదస్సు నిర్వహించారు. క్షయ విభాగ జాతీయ పరిశీలకునితో పాటు, వైద్యులు సతీష్, శివకుమార్, విక్రమ్, గిరి, ప్రభాకర్, శ్రీదేవి పాల్గొని తుమ్మూరు, అమరాగార్డెన్ తదితర ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు.

## చిరస్మరణీయురాలు
# దూబగుంట రోశమ్మ

సారా ఉద్యమ నేత దూబగుంట రోశమ్మ మృతి సమాజానికి తీరని లోటని, ఆమె చిరస్మరణీయురాలని జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి పేర్కొన్నారు. రోశమ్మ మృతికి ఆయన తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. నిరక్షరాస్యురాలైన దూబగుంట రోశమ్మ సారా వ్యతిరేక ఉద్యమంలో ఎంతో మందికి స్ఫూర్తిప్రదాతగా నిలిచారని ఆయన కొనియాడారు.

# రోశమ్మ మృతి తీరని లోటు

సారా ఉద్యమ సారథిగా ఉద్యమాన్ని నడిపి సమాజానికి విశేష సేవలందించిన దూబగుంట రోశమ్మ మృతి తీరని లోటని అనంతసాగరం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేము హరిబాబు అన్నారు. రోశమ్మ మృతి పట్ల ఆయన తీవ్ర సంతాపం తెలియజేస్తూ, ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

**- అశోక్‌బాబు**


మాట్లాడుతున్న ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు, పక్కన రియాజ్ అహ్మద్ తదితరులు

రాష్ట్రంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి దృష్టి సారించనున్నట్లు ఏపి ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరు అశోక్‌బాబు తెలిపారు. గూడూరు పట్టణంలోని ఎన్జీవో భవనంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పిస్తామని చెప్పారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం త్వరలో అమలవుతుందని వివరించారు. జూలై 2015, జనవరి 2016 కరవు భత్యం మంజూరు చేయాలని ప్రభుత్వానికి విన్నవించామన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సమిష్టి పోరాటం ద్వారా 43శాతం ఫిట్‌మెంట్ సాధించగలిగామన్నారు. అంతకుముందు రోడ్లు భవనాల అతిథి గృహం వద్ద నుంచి స్థానిక ఎన్జీవో సంఘం నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శేఖర్‌రావు, డిప్లొమా ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్, వివిధ సంఘాల నాయకులు బాపూజీ, వీఆర్వీ శేఖర్‌రావు, రమణారెడ్డి, అంజనేయమ్మ, తాలూకా యూనిట్ నాయకులు జీవీ శివకుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

## పుష్కర ప్రయాణీకులకు
# జాతీయ రహదారిపై ఇబ్బంది లేకుండా చర్యలు

**- డిఎస్పీ శ్రీనివాస్**


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డిఎస్పీ శ్రీనివాస్

కృష్ణా పుష్కరాలకు వెళ్లే ప్రయాణీకులకు జాతీయ రహదారిపై ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నామని గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ అన్నారు. ఇటీవల గూడూరు టవర్‌క్లాక్ కూడలిలో పుష్కరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యార్థులు, లారీ యజమానులతో కలసి మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 12 నుంచి 23వరకు విజయవాడలో కృష్ణా పుష్కరాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేసిందన్నారు. గతంలో మాదిరిగా పుష్కరాలకు వెళ్లే భక్తులకు జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా, రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. చెన్నై, కోల్‌కత్తా జాతీయ రహదారిపై ఎంతోమంది ప్రయాణీకులు వివిధ రాష్ట్రాల నుంచి ఈ పుష్కరాలకు వస్తుంటారన్నారు. దీంతో వారికి అసౌకర్యం కలుగకుండా రాత్రి 10గంటల నుంచి తెల్లవారుజామున 4గంటల వరకు మాత్రమే లారీలు ప్రయాణాలు సాగించేలా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ సుబ్బారావు, ఎస్‌ఐలు నరేష్‌బాబి, అంకమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాట్రాజు నవ్యకు సన్మానం


కాట్రాజు నవ్యను సన్మానిస్తున్న బలిజ సంఘం ప్రతినిధులు

ప్రతిభా పాటవ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థిని కాట్రాజు నవ్యను పలువురు ప్రశంసించారు. గూడూరు, ఎన్జీవోహోంలో ఆదివారం బలిజ సంఘం ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమెరికాలో సిలికాన్ ఆంధ్ర అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన క్విజ్‌పోటీల్లో మూడుసార్లు విజేతగా నిలిచిన కాట్రాజు నవ్య అనే విద్యార్థినిని ఘనంగా సన్మానించి సత్కరించారు. డిస్కం డిఇ అనిల్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, ఆ సంఘ ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవయ్య, పట్టణ అధ్యక్షుడు మదనమేటి రమణయ్య, ప్రతినిధులు సారంగం శ్రీనివాసులు, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, రమేష్ పాల్గొన్నారు.

## నాయీ బ్రాహ్మణులను
# ఎస్టీ జాబితాలో చేర్చాలి

నాయీ బ్రాహ్మణులను ఎస్టీ జాబితాలో చేర్చి రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని నాయీ బ్రాహ్మణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లూరు సత్యనారాయణమూర్తి నాయీ పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరు టౌన్‌హాల్‌లోని రేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారక భవనంలో రాష్ట్ర, జిల్లా నాయీ బ్రాహ్మణ సేవాసంఘాల ఆధ్వర్యంలో నాయీ బ్రాహ్మణ చైతన్య సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ బీసీల్లో అట్టడుగు వర్గంలో నాయీ బ్రాహ్మణులు దుర్భరమైన జీవితాలను సాగిస్తున్నారని, వారి సంక్షేమానికి ఫెడరేషన్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం, నిధులను నామమాత్రంగా కేటాయించి మోసం చేస్తుందన్నారు. అనంతరం రాష్ట్రంలోని 13జిల్లాలకు నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. తెలుగు రాష్ట్రాల జాతీయ ప్రధానకార్యదర్శి కిన్నెర మాలకొండయ్య నాయీ అధ్యక్షతన సమావేశం జరిగింది.

ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కనకట్ల రఘురామ్ ముదిరాజ్, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కోరిబిల్లి ఏసుబాబు నాయీ, రాష్ట్ర కోశాధికారి కిన్నెర శ్రీనివాసులు, సంఘ జిల్లా, నగర కమిటీ నాయకులు, సభ్యులు, నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీలో కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కె.బాలగురుస్వామి, కోశాధికారిగా కె.శ్రీనివాసులు, కార్యనిర్వాహక కార్యదర్శిగా వి.అనిల్‌కుమార్, సహాయకార్యదర్శిగా కె.విజయకుమార్‌లకు నియామకపత్రాలను అందజేశారు.

## ప్రజల సౌకర్యం కోసమే...
# ఆశ్రమంలో నిబంధనలు

**- గొలగమూడి ఇ.ఓ బాలసుబ్రహ్మణ్యం స్పష్టీకరణ**

గొలగమూడిలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, ప్రజల సౌకర్యం కోసమే ఆశ్రమంలో కొన్ని నిబంధనలు అమలుచేస్తున్నామని గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమ ఇ.ఓ, విశ్రాంత ఐఏఎస్ అధికారి పి. బాలసుబ్రహ్మణ్యం తెలియజేశారు. ఇటీవల ఆయన విలేకర్లతో మాట్లాడుతూ హైకోర్టు ఆదేశానుసారం తాము పదేళ్ళుగా ఇక్కడ బాధ్యతలు నిర్వర్తిస్తున్నామన్నారు. ఈ పదేళ్లలో స్వామివారి ఆస్తుల విలువ నూరుకోట్లకు పెరిగిందన్నారు. తాము జీతభత్యాలు తీసుకోకుండా స్వామివారి ఆశ్రమంలో బాధ్యతలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఆలయానికి కొన్ని నిబంధనలు వుంటాయని, వాటిని ఉల్లంఘించడం చట్టరీత్యా నేరమని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో, సాధనా పదయాత్ర భక్తులకు స్వామివారి దర్శన ఏర్పాట్లు, ప్రసాద వితరణ, స్వామివారి అన్నప్రసాదం ఏర్పాటు చేయగలం కానీ, ఆశ్రమం ఆవరణలో ఆశ్రమం వారు ఏర్పాటుచేసిన కార్యక్రమాలు తప్ప మిగిలిన వాటికి అనుమతి లేదని సాధనా పదయాత్ర నిర్వాహకుడు అల్లు భాస్కరరెడ్డికి తెలియజేశామన్నారు. తదుపరి జరిగే పాదయాత్రలో ఆశ్రమశాంతికి భంగం కలిగే అవకాశం వుందని భావించి ఏప్రిల్‌లో పోలీసులకు ముందస్తుగా తెలియజేశామన్నారు. దీంతో పాదయాత్రకు ఆశ్రమ ప్రాంగణంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారన్నారు. మే, జూన్‌లలో ఆశ్రమం ప్రాంగణంలో శాంతికి భంగం కలిగించే సంఘటనలేమీ జరగలేదని, అయితే, జులై 10న ఆశ్రమ సమాధిమందిరంలో దురదృష్టకరమైన సంఘటన జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అల్లు భాస్కరరెడ్డి అనుచరులు కొందరు ఆశ్రమ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తూ, స్వామివారి సన్నిధిలో నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహ రించారని, ఆశ్రమ సిబ్బందిపై దురుసుగా వ్యవహరించి ఒక అటెండర్‌పై చేయి చేసుకున్నారని, ఆ సందర్భంలో ఇఓని వ్యక్తిగతంగా అసభ్య పదజాలంతో దూషించారని ఆయన పేర్కొన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా వారిని స్వామివారి సమాధి మందిరంలో కాక, వైభవోత్సవ మండపంలో కూర్చోమని ఆశ్రమ సిబ్బంది కోరినందుకు వారిలో ఇద్దరు ఆశ్రమ సిబ్బందిపై దౌర్జన్యం చేశారని పేర్కొన్నారు. ఏ విధమైన ప్రోత్సాహం లేకనే ఇలాంటి పరిణామాలు జరిగేందుకు అవకాశం లేదని, ఇఓతో ఎలాంటి సంబంధం లేనివారు ఇఓను అసభ్యంగా దూషించడం, ఆశ్రమంలో అనుమతిలేని ఇతరుల సత్సంగం నిషేధం, ఆశ్రమ ఆవరణలో అనుమతిలేని వీడియో, ఫోటోగ్రఫీ నిషేధం తదితర అంశాలను వారు ప్రస్తావించుటకు కారణాలను అర్థం చేసుకోవడం అసాధ్య మేమీ కాదని ఆయన అన్నారు. ఈ విషయాలను పోలీసువారికి ఫిర్యాదు రూపంలో ఇచ్చామన్నారు. నెల్లూరులోని చిన్నపిల్లల పార్కు పక్కన వున్న సాయిబాబా మందిరంలో సాధనా పదయాత్ర మొదలై స్వామి మందిరానికి వచ్చేవారని, ఇది కొంతకాలంగా జరుగుతుం దేదని, అదేవిధంగా కొన్నేళ్ళుగా అక్కడ సత్సంగం కూడా జరిగేదని, వీటిని గత మే 1 నుంచి ఆ మందిరం నిర్వాహకులు నిషేధించారని ఆయన ఈ సందర్భంగా పేర్కొ న్నారు. వెంకయ్యస్వామి సమాధిమందిరంలో సిబ్బందిపై జరిగిన దౌర్జన్యం వంటి దురదృష్టకరమైన సంఘటన వంటిదే గతంలో సూళ్ళూరుపేటలోని సాయి మందిరంలోనూ జరిగినట్లు తెలుస్తోందని, ఆ సంఘటనలో బాధ్యులైన అల్లు భాస్కరరెడ్డి కుమారునికి కోర్టులో శిక్షపడినట్లు కూడా తెలుస్తోందని ఆయన పేర్కొన్నారు. టిటిడికి సంబంధించిన ఒక వివాదంలో, దేవస్థానం అనుమతిలేని కార్యక్రమములేవీ దేవస్థానం ఆవరణలో జరుపుటకు అవకాశం లేదని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చివుందని, ఈ విషయాల దృష్ట్యా, మరియు ఆశ్రమ శాంతి భద్రతలు, పవిత్రత దృష్ట్యా ఆశ్రమంలో అనుమతి లేని కార్యక్రమాలు నిషేధించుట జరిగిందని ఆశ్రమ ఇ.ఓ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# కల్యాణ వైభవం...!

## సాహితి - ప్రణీత్‌కుమార్‌రెడ్డి



కావలి నియోజకవర్గంతో పాటు నెల్లూరుజిల్లాలోని అన్ని రాజకీయపార్టీల వారికి సుపరిచితుడు, కాంగ్రెస్‌వాది కీర్తిశేషులు కోర్సపాటి గోపాలరెడ్డి - శ్రీమతి సీతమ్మల మనుమరాలు **సాహితి** వివాహం **ప్రణీత్‌కుమార్‌రెడ్డి**తో ఆగస్టు 6వ తేదీ నెల్లూరులో జరిగింది.

సాహితీ తండ్రి షణ్ముఖరెడ్డి - హైమావతిలు రేణిగుంట స్థిరనివాసులు కాగా, సాహితీ మేనమామ కోర్సపాటి శ్రీధర్‌రెడ్డి అమెరికాలోని డాలస్ నగరంలో ప్రముఖుడు. నవదంపతులకు 'లాయర్' శుభదీవెనలు.

## రాహుల్ - తరుణి



రెడ్డి & రెడ్డి వరదారెడ్డి అంటే నెల్లూరులో తెలియనివారు బహుశా బహు అరుదు. 70వ దశకంలో నెల్లూరుజిల్లాలో రెడ్డి & రెడ్డి అంటే చాలా ప్రసిద్ధి. కీర్తిశేషులు వరదారెడ్డి - శ్రీమతి హజరత్తమ్మల మనుమడు రవీంద్రకుమార్‌రెడ్డి - రేవతిల కుమారుడు **రాహుల్** కళ్యాణం **తరుణి**తో ఆగస్టు 7న హైదరాబాద్‌లో జరిగింది.

రవీంద్రరెడ్డితో పాటు వధువు తండ్రి మధుసూధనరెడ్డి చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా ప్రసిద్ధి కావడంతో జిల్లాకు చెందిన పలువురు రాజకీయ వ్యాపార ప్రముఖులతో పాటు అనేకమంది ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు ఈ వివాహ వేడుకలో పాల్గొన్నారు. నూతన దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

### నంబూరు కుటుంబం ఆధ్వర్యంలో కనులపండువగా...

# చెంగాళమ్మకు పుష్పాభిషేకం





మొదటి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరీ దేవస్థానం నందు ఈ నెల 5వ తేదీన అమ్మవారికి పుష్పాభిషేకం కనులపండువగా నిర్వహించారు. నెల్లూరుకు చెందిన నంబూరు లేబొరేటరీస్ అధినేత నంబూరు మోహన్‌రావు - శ్రీమతి సులోచన, అలయన్స్ గ్రూప్ అధినేత నంబూరు మనోజ్ - శ్రీమతి లత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించిన ఈ పుష్పాభిషేకాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో వివిధ రకాల పుష్పాలతో నిర్వహించారు. అర్చకుల మంత్రోచ్చారణలతో అమ్మవారికి పుష్పాభిషేకం, పూజలు నిర్వహించారు. వేల సంఖ్యలో విచ్చేసిన భక్తులు భక్తితన్మయత్వంతో పరవశించారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆలయ మాజీఛైర్మెన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి, తెలుగుదేశం నాయకులు వేనాటి రామచంద్రారెడ్డి, హోటల్ కిన్నెర అధినేత బద్దెపూడి సునీల్‌రెడ్డి, ఇ.ఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

### తండ్రి ఆశయసాధన కోసం...

# తనయుని వితరణ

- అమ్మా-నాన్నల పేరుతో భారీ విరాళం
- కోవూరు కాలేజీకి 75 లక్షలు అందజేసిన యరబాక మీరారెడ్డి





తండ్రి ఆశయాన్ని నెరవేర్చడం కోసం ఓ తనయుడు భారీ వితరణ ఇచ్చి తన అమ్మా-నాన్నల పేర్లు సార్ధకమయ్యేందుకు కృషి చేస్తూ తన జీవితాన్ని ధన్యం చేసుకున్నాడు. ఆ వితరణ గుణశీలి పేరు యరబాక మీరారెడ్డి. మీరారెడ్డి నెల్లూరువాడే. కపర్ది స్టాబోర్డ్స్(అట్టల ఫ్యాక్టరీ) యజమాని యరబాక కృష్ణారెడ్డి తనయుడే ఈయన. ప్రస్తుతం ఆయన చెన్నైలో నివాసం వున్నాడు. నిర్మాణ రంగంలో వున్న ఆయన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కూడా. అందు లోనూ తల్లిదండ్రులంటే ఆయనకు ఎనలేని అభిమానం.. ప్రాణంతో సమానం. వీరి స్వస్థలం నెల్లూరుజిల్లాలోని పొదలకూరు మండలంలో వున్న తాటిపర్తి గ్రామం. మీరారెడ్డి తండ్రి కృష్ణారెడ్డి ఆ గ్రామంలో విద్యాభివృద్ధి కోసం కళాశాలను నిర్మించాలని భావించేవారు. అయితే, అక్కడ కళాశాల నిర్మాణానికి అవకాశం లేక పోవడంతో, తండ్రి ఆశయాన్ని ఎలాగైనా సరే నెరవేర్చాలన్న సంకల్పంతో ఆయన తనయుడు మీరారెడ్డి కోవూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 75 లక్షల రూపాయలు భారీ విరాళం ఇచ్చాడు. తన తండ్రి ఆశయం నెరవేరాలని, అదేవిధంగా తన అమ్మా-నాన్నల



పేర్లు శాశ్వతంగా వుండాలనే సత్సంకల్పంతో ఇచ్చిన ఆ భారీ విరాళంతో ప్రభుత్వం కోవూరు డిగ్రీ కళాశాల అభివృద్ధికి సమాయత్తమవుతోంది. ఆ కళాశాలకు తరగతి గదుల నిర్మాణానికి, ప్రహరీగోడ ఏర్పాటుకు ఆ నిధిని వెచ్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు రాష్ట్ర కాలేజియేట్ కమిషనర్ తాజా ప్రొసీడింగ్స్‌లో ఈ విషయం పేర్కొన్నారు. విరాళప్రదాత కోర్కె మేరకు ఆయన తల్లిదండ్రుల పేరుతో 'శ్రీ యరబాక కృష్ణారెడ్డి-కౌశల్యమ్మ డిగ్రీ కళాశాల'గా ఆ కళాశాలకు నూతనంగా నామకరణం చేసేందుకు తగు ఏర్పాటు చేయాలని కళాశాల ప్రిన్సిపల్‌ను ఆదేశిస్తూ రాష్ట్ర కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీమతి బి.ఉదయలక్ష్మి ప్రొసీడింగ్స్ జారీ చేశారు. తమ స్వస్థలం తాటిపర్తి అయినప్పటికీ, తన తండ్రి చాలా ఏళ్ళు నెల్లూరులో నివాసం వున్నారని, ఆ అభిమానంతో నెల్లూరుకు సమీపంలోని కోవూరులో డిగ్రీ కళాశాల అభివృద్ధికి 75 లక్షలు విరాళమివ్వడం తల్లిదండ్రుల పట్ల ఆయనకున్న గౌరవాభిమానాలకు ప్రతీక. తండ్రి ఆశయాన్ని నెరవేర్చిన ఆ తనయుని జీవితం ధన్యమే. తల్లిదండ్రులను ఏమాత్రం పట్టించుకోకుండా.. వారిపట్ల కనీసం కనికరం లేకుండా కాఠిన్యపు తనయులెందరో వున్న నేటి సమాజంలో, తండ్రి ఆశయం నెరవేర్చేందుకు ఇంత భారీ మొత్తాన్ని ఓ కళాశాలకు విరాళంగా ఇచ్చిన మీరారెడ్డి ఎంతైనా అభినందనీయుడే!..


మీరారెడ్డి వంటి సహృదయుడు.. సమాజానికి మార్గ దర్శకుడు. ఆదర్శనీయుడు కూడా!.. ఆ నిధితో ఆ కళాశాల సరస్వతీ నిలయంగా వర్ధిల్లాలని, విద్యాభివృద్ధిలో అగ్రగామిగా రాణించి దాతల పేరు చిర స్థాయిగా నిలపాలని మనసారా కోరుకుందాం!.... ఏదేమైనా అమ్మా-నాన్నల సంస్మరణలో ఇంత భారీ విరాళం ఇచ్చిన మన మీరయ్య అభినందనీయుడు!

ముస్తాబుకు సిద్ధంకానున్న కాలేజీ భవనం



### 18 నుంచి గొలగమూడిలో

# భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



గొలగమూడిలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి 34వ ఆరాధనోత్సవాలు ఈ నెల 18 నుంచి 24వ తేది వరకు వైభవోపేతంగా జరుగనున్నాయి. ప్రత్యేక పూజలతో, ఉదయం రాత్రి వాహనసేవలతో స్వామివారి మందిరం కళకళ లాడనుంది. వాహనసేవల్లో భాగంగా ఈ నెల18న ఉదయం 10 గంటలకు సర్వభూపాల వాహనసేవ, రాత్రి 9 గంటలకు కల్పవృక్ష వాహనసేవ నిర్వహిస్తారు. అదేవిధంగా 19న ఉదయం హనుమంతసేవ, రాత్రికి చంద్రప్రభ వాహనసేవ, 20న ఉదయం చినశేషవాహనసేవ, రాత్రి 9 గంటలకు హంస వాహనసేవ, 21న ఉదయం 10 గంటలకు సూర్యప్రభ, రాత్రి 9 గంటలకు గజవాహనసేవ, 22న ఉదయం 10గంటలకు అశ్వవాహనసేవ, రాత్రి 9 గంటలకు పెదశేషవాహనసేవ, 23న ఉదయం 10 గంటలకు సింహ వాహనసేవ, రాత్రి 9 గంటలకు గరుడసేవ నిర్వహిస్తారు. 24న ప్రధానమైన ఆరాధనోత్సవం జరుగుతుంది. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు రథోత్సవం, రాత్రి 8 గంటలకు తెప్పోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. స్వామివారి ఆరాధనోత్సవాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తారు కనుక, ఆ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆశ్రమ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## 'ప్రభా'తం

*గలగలా గోదారి కదిలిపోతుంటేను*
*బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను*
*బంగారు పంటలే పండుతాయి*
*మురిపాల ముత్యాలు దొరలుతాయి!...* అంటూ ప్రసిద్ధ కవి శంకరంబాడి సుందరాచారి 'మా తెలుగుతల్లికీ మల్లెపూదండ' గీతంలో ఆ నదీమతల్లుల ప్రాశస్త్యాన్ని అత్యద్భుతంగా వర్ణించారు. నదీపరీవాహక ప్రాంతాల్లోనే నాగరికత విలసిల్లింది. మానవ మనుగడకు ప్రాణప్రదమైన జీవజలాలను ఇచ్చే నదీనదాలు మనకు ఎల్లవేళలా పూజనీయాలే. నీరు లేకుంటే మానవునికి ఉనికే లేదు. ప్రతి మనిషికీ..చెట్టు చేమకు..సకల జీవరాశులన్నిటికీ నీరే ప్రాణాధారం. అందుకే, ప్రాచీన మానవుడు సైతం నదుల చుట్టూతా వుండే ప్రాంతాల్లోనే నివాసం వుంటూ, క్రమంగా నాగరికతకు జీవం పోసుకున్నాడు. పంటలు పండాలన్నా, ప్రకృతి కళకళలు ఈ నేల అంతటా నిండాలన్నా, మనిషికి ప్రాణం వుండాలన్నా కూడా జలమే ఆధారం. అందుకే, ఇంతటి మహత్తరమైన జీవజలాలనిచ్చే నదులు ప్రతిఒక్కరికీ ప్రాణంతో సమానం. అందులోనూ ఈ వేదభూమిలో ప్రవహించే గంగా, యమున, సరస్వతి, తుంగభద్ర, కావేరి, కృష్ణా, గోదావరి తదితర నదుల ప్రాశస్త్యం అంతా ఇంతా కాదు. నదీమతల్లుల ఆరాధన మన పవిత్రభారత దేశంలో ప్రాచీనకాలం నుంచీ వుంది. గంగమ్మతల్లిని గంగామాతగా ఆరాధిస్తూనే వున్నాం. ఇలాంటి పరమపావనమైన కొన్ని నదుల్లో పుష్కరుడు ప్రవేశించిన సమయాలు మరింత పుణ్యాన్ని చేకూరుస్తాయని, పుష్కర పుణ్యనదీస్నానం మానవజన్మలను పావనం చేస్తుందని పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. నదులు పుణ్యధామాలు కనుక, ఆయా నదుల పుష్కరవేళలను గుర్తించిన మన పూర్వులు.. రుషులు ఆ పుణ్యాన్ని మూటగట్టి తరతరాలుగా మనకు అందిస్తూనే వున్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావం పొంగిపొర్లేలా జరిగే ఈ పుష్కర ఉత్సవాల సత్సంప్రదాయం ఎంతో పవిత్రభావంతో నేటికీ కొనసాగుతూనే వుండడం మనందరి భాగ్యం. ఇకపోతే, ఈ పుష్కరశోభతో అలరారే కృష్ణానదీమతల్లి వైభవం చూడాలంటే.. చూడాల్సింది ఇప్పుడే. ఈ నెల 12 నుంచి 23వ తేది వరకు పన్నెండురోజులపాటు జరిగే కృష్ణా పుష్కరాల శోభ వర్ణించనలవి కాదంటే అతిశయోక్తి కాదు. ఇదో ఉప్పొంగే భక్తిభావ సంరంభం. సహ్యాద్రిలో పుట్టి మూడు రాష్ట్రాల్లో పయనించి దాదాపు ఎనిమిది వందల మైళ్ళు దాటి నవ్యాంధ్రను పునీతం చేస్తున్న కృష్ణమ్మతల్లి.. రాష్ట్రాన్ని నదీజలాలతో సస్యశ్యామలం చేస్తోంది. మన భూములను మాగాణం చేసి, రైతన్నల ఇంట సిరులు కురిపిస్తోంది. అంతేకాదు, కోట్లాదిమంది ప్రజల నివాసాల్లో విద్యుత్ వెలుగులు నింపే తేజోకిరణాలు కృష్ణవేణీ తరంగాలే. ఇలా ఎన్నోవిధాలుగా మన జీవితాలను, జీవనాలను కాపాడుతున్న ఆ తల్లి రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేం. అందుకు కృతజ్ఞతాపూర్వకంగా నిండు మనసుతో రెండు చేతులూ ఎత్తి ఆ కృష్ణమ్మతల్లికి సాగిలబడి నమస్కరించడమొక్కటే మనం చేయగలిగింది. అందుకు ఇదే అత్యంత శుభ సందర్భం. ఎక్కడ చూసినా పోటెత్తుతున్న జనం, వేలాదిమంది అధికారగణం, అనేకచోట్ల వెలిసిన పుష్కర ఘాట్లు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించే ఉన్నతాధికారులు, భారీ బందోబస్తులో పెద్దఎత్తున పోలీసు బలగాలు, వేలాది బస్సులతో ఆర్టీసి సేవలు, స్వచ్ఛంధసంస్థల వారు, అంతటా వెల్లువలా వెల్లివిరిసే పుష్కర సంరంభాలతో విజయవాడ, గుంటూరు, అమరావతి, గోరంట్ల కృష్ణానదీ పరీవాహక ప్రాంతాలైన కర్నూలు తదితర ప్రాంతాలన్నీ హోరెత్తిపోతున్నాయి.. పుష్కర శోభతో భక్తుల మానసాలను ఉరకలెత్తిస్తున్నాయి. రోజుకు కనీసం నాలుగున్నర లక్షల మంది జనం వస్తారని, మొత్తంగా 3 కోట్ల మందిదాకా ప్రజలు ఈ పుష్కరాల్లో పాల్గొనవచ్చని అంచనా. ఇందులో కనీసం రెండున్నర కోట్లమంది ఒక్క విజయవాడ నగరం లోని పుష్కరఘాట్‌లలోనే పుణ్యస్నానాలు చేస్తారని కూడా భావిస్తున్నారు. ఆ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో..నూతన రాజధాని విజయవాడ వేదికగా తొలిసారి జరిగే ఈ మహాసంరంభాన్ని విజయవంతం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రభుత్వం.. మంత్రులు, నాయకులు, అధికారగణం, స్థానిక ప్రజలు, స్వచ్ఛంధసేవకులు అందరూ కంటిమీద కునుకులేకుండా రేయింబవళ్ళు కృషి చేస్తున్నారు. గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో వుంచుకుని ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా అధికారులు పూర్తిస్థాయిలో భద్రతాచర్యలు చేపట్టారు. అత్యంత భారీగా..దాదాపు మూడు కోట్ల మంది దాకా భక్తులు తరలివచ్చే ఈ పుష్కరోత్సవాలకు కోట్లాదిరూపాయల వ్యయంతో జరిగే ఏర్పాట్లు అపూర్వం..అద్వితీయం. ఆధ్యాత్మికభావం వెల్లువెత్తేలా జరిగే ఈ సంబరాల సందడితో కృష్ణమ్మతల్లి హృదయం పులకించి పరవశిస్తోంది. గుంటూరుజిల్లాలోని అమరావతి, సీతానగరం, తాళ్లాయపాళెం, పెనుమూడి, కర్నూలు జిల్లాలో బీచ్‌పల్లి, సంగమేశ్వరం, శ్రీశైలం సమీపంలోని లింగాలగట్టు తదితర ప్రాంతాలన్నిటికీ భక్తుల కోసం బస్సులు సిద్ధంగా వున్నాయి. పుష్కరప్రవేశంతో కృష్ణానది మొత్తం పుణ్యప్రదమై వుంటుంది కనుక ఆ నదిలో ఎక్కడ పుణ్యస్నానాలాచరించినా పుణ్యమే కనుక..భక్తులు అవకాశం వున్నచోటల్లా కృష్ణవేణీ నదీ తరంగాల్లో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భారీగా తరలివస్తున్నారు.

పుష్కరుని రాకతో పావనమైన మన కృష్ణమ్మ తల్లికి..ఈ మహోత్సవాల శుభవేళ..ఇవే కోటిదండాలు. అదిగో!.. 'కృష్ణమ్మ పిలుస్తోంది.. రండి! కదలిరండి'...నవ్యాంధ్రను కళకళలాడించే ఈ దివ్యశోభలో.. ఈ బృహత్తర.. మహత్తర మహోత్సవంలో మనమూ పాల్గొని తరిద్దాం రండి!..

### కృష్ణమ్మతల్లికి.. కోటిదండాలు



మానవ మనుగడకు ప్రాణప్రదమైన జీవజలాలను ఇచ్చే నదీనదాలు మనకు ఎల్లవేళలా పూజనీయాలే. నీరు లేకుంటే మానవునికి ఉనికే లేదు. ప్రతి మనిషికీ.. చెట్టు చేమకు.. ప్రకృతికి.. సకల జీవరాశులన్నిటికీ నీరే ప్రాణాధారం. మానవజాతి వికసనానికి, నాగరికతకు నదీపరీవాహక ప్రాంతాలే మూలం. నదులను ఆరాధించడం ఓ పవిత్ర కార్యం. అందుకే పుష్కరాలకు అంతటి ప్రాధాన్యత. అదిగో!.. కృష్ణమ్మ పిలుస్తోంది.. రండి! ఈ మహత్తర.. బృహత్తర మహోత్సవంలో మనమూ పాల్గొని తరిద్దాం రండి!.



## రోశమ్మకు నేస్తం నివాళులు

ప్రముఖ సంఘసంస్కర్త, సారా వ్యతిరేక ఉద్యమకారిణి దూబగుంట రోశమ్మ మరణం సమాజానికి తీరనిలోటని తెలియజేస్తూ నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు కస్తూరిదేవి పాఠశాల ప్రాంగణ గోడలపై చిత్రీకరించిన ఆమె చిత్రం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు కోరెం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ నాటి సారా వ్యతిరేక ఉద్యమాన్ని మూడు దశాబ్దాల పాటు నడిపి మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్.టి.రామారావుచే సంపూర్ణ మద్యపాన నిషేధంపై అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి సంతకం చేయించిన ఘనత దూబగుంట రోశమ్మదన్నారు. కార్యక్రమంలో నేస్తం ఫౌండేషన్ సభ్యులు గాలి శివ, పంచా నాగేంద్ర, జొన్నవాడ చైతన్య, నరశింహారావు, వేణు, హరీష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## బార్ ఎన్నికల్లో సి.సి. కెమెరాలు

నెల్లూరు బార్ అసోసియేషన్‌కు ఈ నెల 19వ తేదీ జరుగనున్న ఎన్నికలకు సిసి కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఎన్నికల్లో అధ్యక్షునిగా పోటీ చేస్తున్న పి.ఇ.విజయంతో పాటు మరో 12మంది అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు వారి ఖర్చులతో సిసి కెమెరాల ఏర్పాటుకు బార్ ఎన్నికల అధికారి అనుమతించారు. ఈ సందర్భంగా అధ్యక్ష అభ్యర్థి విజయం మాట్లాడుతూ అడ్వకేట్ యాక్ట్ ప్రకారం న్యాయవాది ఒకే బార్‌లో సభ్యునిగా నమోదు చేసుకోవాలని, అంతకు మించి ఎక్కువ బార్‌లలో నమోదు చేసుకున్నట్లయితే ఓటింగ్‌లో పాల్గొనేందుకు అనర్హులని తెలిపారు. న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నవారు మరే ఇతర వృత్తుల్లో గానీ, వ్యాపారాల్లోగాని, ప్రైవేటు ఉద్యోగాల్లో గాని కొనసాగరాదని, ఆ విధంగా కొనసాగుతున్న వారు కూడా ఈ ఎన్నికల్లో ఓటరుగా పాల్గొనరాదన్నారు. అలా పాల్గొనడం చట్టవ్యతిరేకమని పేర్కొన్నారు.

## దళితవాడలో పినాకిని స్వచ్ఛభారత్



ఇంటర్నేషనల్ యూత్ డేని పురస్కరించుకుని రత్నమ్మ ఛారిటబుల్ సొసైటి, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరు కొండాయపాలెం దళితవాడ నగరపాలక ప్రాథమిక పాఠశాల ప్రాంతం పరిసరాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్ఆర్ యుసిసి రైల్వే మెంబర్ వొమ్మిన నాగసతీష్‌బాబు, బిసి సంక్షేమసంఘం మహిళా అధ్యక్షురాలు డి.ఆర్.ఇందిర, యస్‌విఆర్ స్కూలు కరస్పాండెంట్ అందె శ్రీనివాసులు, కె.మురళీమోహన్‌రాజు పాల్గొని స్కూలు పరిసర ప్రాంతాల్లోని చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో స్కూలు ప్రధానోపాధ్యాయుడు యం.భాస్కర్‌రావు, రవి గోగులపల్లి, రాచపాళెం రఘు, వంశీకుమార్ తదితరులు పాల్గొన్నారు.




## విదేశీ పర్యటనలు ఎవరి కోసం?

వాస్కోడిగామా, కొలంబస్, పాహియాన్ వంటి వారు అప్పుడు ప్రపంచయాత్రలు చేసి కొత్త కొత్త దేశాలు కనిపెట్టారు. ప్రధాని నరేంద్ర మోడీ విశ్వవిఖ్యాతి కోసం, దేశ ప్రయోజనాలు, విదేశాలతో స్నేహసంబంధాల కోసం విదేశీ యాత్రలు చేస్తున్నారు. చంద్రబాబు కాలు కాలిన పిల్లిలాగా విదేశాలు ఎందుకు తిరుగుతున్నాడో అర్థం కాదు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రపంచ దేశాలు తిరగవచ్చా? చంద్రబాబు ప్రపంచ దేశాల పర్యటనల వల్ల మన రాష్ట్రానికి ఒరిగిందేమిటి? దీనికి చంద్రబాబు సమాధానం చెప్పాలి.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## టీవీలలో రచ్చ ఏంటి?

నాలుగు ప్రధాన ఛానెల్స్‌లో ఒకప్పటి సినీతారలు రచ్చబండ, జట్కాబండి వంటి పేర్లతో చేస్తున్న పంచాయితీలు చూస్తుంటే అసహ్యంగా ఉంది. కుటుంబాల వివాదాలను వీరు పంచాయితీ చేయడమేమిటి? పోలీస్‌స్టేషన్‌లు, న్యాయస్థానాలు ఎందుకున్నట్లు? ఈ షోలలో వీరు చేస్తున్న ఓవర్ యాక్షన్ చూడలేకపోతున్నాం. ముందు వీళ్ల కుటుంబాలు ఏ మాత్రం సక్రమంగా ఉన్నాయో చూసుకోమనండి. వీళ్లు కాపురాలు సరిదిద్దడం అటుంచి, వీరి ఓవరాక్షన్ మూలంగా మనస్పర్థలు మరింతగా పెరిగే అవకాశముంది.

**లెక్కాకుల సుజని, నెల్లూరు.**

## ఈ ఐదేళ్లు హరీ!...

చంద్రబాబు రెండున్నరేళ్ల పాలన... ఒక ఏడాది గోదావరి పుష్కరాలు... మరో ఏడాది కృష్ణా పుష్కరాలు... మధ్యలో పట్టిసీమ, అమరావతి రాజధాని... మిగిలిన రెండున్నరేళ్లు కూడా రాజధానితోనే ముగిసిపోతుంది. రాష్ట్రం అభివృద్ధి అంటే రాజధాని అభివృద్ధి అన్నంత మూర్ఖత్వంతో పనిచేస్తున్నాడు చంద్రబాబు. ఈ రాష్ట్రంలో 13జిల్లాలున్నాయని, అన్ని జిల్లాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందినట్లనే విషయాన్ని ఆయన ఎప్పటికి తెలుసుకుంటాడో?

**బండి నగేష్‌రెడ్డి, నెల్లూరు.**

# జిల్లాలో 'దేశం' బలహీనం





- సర్వేపల్లిలో పరిస్థితి మెరుగు
- ఆనంతో ఆత్మకూరులో పట్టు
- మిగతా నియోజకవర్గాలలో వీక్

**తెలుగుదేశంపార్టీ బలహీనంగా ఉన్న జిల్లాల్లో నెల్లూరు జిల్లా ప్రముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే 2014 ఎన్నికల నాటికే ఈ పరిస్థితి వున్నా, పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేళ్లలో కూడా ఆ పార్టీ పరిస్థితి ఏ మాత్రం మెరుగుపడలేదని ఆ పార్టీ అంతర్గతంగా నిర్వహించిన సర్వేలలోనే వెల్లడైనట్లు తెలుస్తోంది.**

రెండున్నరేళ్ల తర్వాత కూడా జిల్లాలో పార్టీ పుంజుకోకపోవడంతో పాటు గెలిచిన స్థానాలలో కూడా బలహీనపడడంపై ఆ పార్టీ అధిష్టానం అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. 2014 ఎన్నికల్లో జిల్లాలోని ఎంపీ స్థానంతో పాటు 7 అసెంబ్లీలను కూడా వైకాపా గెలుచుకోగా, తెలుగుదేశంకు కేవలం 3స్థానాలే దక్కాయి. ఈ ఫలితాల మీద చంద్రబాబు అసంతృప్తి చెంది, నెల్లూరు జిల్లా ప్రజల మీద అలగడం తెలిసిందే! కాని వచ్చే ఎన్నికల నాటికి ఈ జిల్లాలో పార్టీ పరిస్థితిని మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఈ కోణంలోనే ఆనం సోదరులతో పాటూ, గూడూరు వైకాపా ఎమ్మెల్యే పాశం సునీల్‌ను, మరికొంతమందిని తెలుగుదేశంలోకి తీసుకున్నారు. చంద్రబాబు ఎంత చేసినా పార్టీ పరిస్థితి మెరుగుపడడం లేదు. ముఖ్యంగా ఈ జిల్లాలో కార్యకర్తలు, ప్రజల బాధలు పట్టించుకునే మంత్రి లేదు. ఈ జిల్లాకు చెందిన నారాయణ మున్సిపల్ మంత్రిగా వున్నప్పటికీ ఆయన చంద్రబాబుకు సంబంధించిన మంత్రేగాని, జిల్లా సమస్యలు తీర్చే మంత్రి కాదు. ఈ జిల్లాలో పార్టీకి మంత్రి పెద్ద మైనస్. ఇక నెల్లూరు నగరం, రూరల్‌లో పార్టీ మొదటి నుండి బలహీనంగానే వుంది. ఇక్కడ వైకాపా ఎమ్మెల్యేలిద్దరు కూడా నిత్యం ప్రజల్లో వుంటూ ప్రజా సమస్యలపై పోరాడుతున్నారు. వారి మీద వ్యతిరేకత రావడం లేదు. ఇక్కడ తెలుగుదేశంకు నాయకులెక్కువ. అయితే వారిలో ప్రజల్లోకి పోయేవాళ్లు తక్కువ. కోవూరులో మొన్న గట్టి పోటీ మధ్య తెలుగుదేశం అభ్యర్థిగా పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి గెలిచాడు. పార్టీలో ఇక్కడా వర్గపోరు వుంది. ఇక ప్రభుత్వ వ్యతిరేకత కనిపిస్తోంది. ఉదయగిరి పరిస్థితీ అంతే! ప్రభుత్వంతో పాటూ స్థానిక ఎమ్మెల్యే బొల్లినేని రామారావు మీద కూడా వ్యతిరేకత బాగానే వుంది. పార్టీ ఇక్కడ క్రమంగా బలహీనపడుతోంది. కావలిలో వైకాపా ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బాగానే పని చేస్తున్నాడు. ప్రజల మధ్య బాగానే తిరుగుతున్నాడు. కావలి ఇన్‌ఛార్జ్‌గా బీద మస్తాన్‌రావు ఇక్కడ ప్రజలకు అందుబాటులోనే ఉంటున్నప్పటికి ప్రభుత్వ వ్యతిరేక ప్రభావం బలంగానే వుంది. సూళ్లూరుపేట, గూడూరులలోనూ గ్రూపులు, వర్గాల మూలంగా పార్టీ నష్టపోతోంది. ముఖ్యంగా గూడూరులో ఎమ్మెల్యే పాశం సునీల్‌ను పార్టీలోకి తీసుకున్నప్పటికీ అది పార్టీకి మేలు చేయడం కంటే కూడా పార్టీకి చేటు తెచ్చే అవకాశముంది. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రజలతో సన్నిహితంగా వుంటూ తన పనితాను చేసుకుపోతుండగా, తెలుగుదేశంలో మాత్రం నాయకులు నాలుగు వర్గాలుగా విడిపోయి తన్నుకుంటున్నారు. వెంకటగిరిలో కూడా పార్టీ పరిస్థితి కొంత తగ్గినట్లు తెలుస్తోంది. కాకపోతే ఇక్కడ వైకాపాకు పూర్తిస్థాయి నాయకత్వం లేకపోవడం తెలుగుదేశంకు కాస్తా ఊరటనిస్తోంది. గత ఎన్నికల్లో వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన కొమ్మి లక్ష్మయ్య ఇప్పుడు పార్టీకే దూరంగా ఉంటున్నాడు. జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి వెంకటగిరిలో పార్టీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నప్పటికి ఆయన పూర్తి స్థాయిలో దృష్టిపెట్టే అవకాశం లేకపోవడం తెలుగుదేశంకు కలిసొస్తోంది. ఆత్మకూరులో మాత్రం ఆనం చేరిక తర్వాత పార్టీ కొంత బలపడినట్లు తెలుస్తోంది. అయితే కన్నబాబు, ఆనంలు కలిసి పని చేస్తేనే పార్టీకి ఉపయోగముంటుంది. మళ్లీ గ్రూపులు కడితే పార్టీకి నష్టమే! తెలుగుదేశం నాయకులు సంతోషించాల్సిన ఒకే ఒక్క అంశం 2014 ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు సర్వేపల్లి నియోజకవర్గంలో పార్టీ బలపడడం. ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక కాకాణి ఇమేజ్ బాగా తగ్గింది. అదే సమయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్గ్‌గా, ఎమ్మెల్సీగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటున్నాడు. సమస్యలపై సత్వరం స్పందిస్తున్నాడు. తన కార్యాలయాన్ని కూడా ప్రతిరోజూ గ్రీవెన్స్ సెల్ సెంటర్‌గా మార్చాడు. నియోజకవర్గంలో తన కేడర్‌ను పెంచుకోవడంతో పాటు పార్టీ పటిష్టతకు కూడా పాటుపడ్డాడు.

ఇప్పుడున్న పరిస్థితుల్లోనే జిల్లాలో ఎన్నికలు పెడితే గతంలో వచ్చినంత మాత్రం ఫలితాలు కూడా రావనే ఆందోళన తెలుగుదేశం వర్గాలలో వుంది. కాబట్టి పార్టీ బలహీనపడ్డ నియోజకవర్గాల నాయకత్వంపై చంద్రబాబే స్వయంగా దృష్టి పెడుతున్నట్లు తెలుస్తోంది.



# బెంబేలెత్తిస్తున్న బిపిఎస్

## అక్రమాల కంటే సక్రమంగా కట్టుకోవడమే మేలనుకుంటున్న భవన యజమానులు

*నెల్లూరు నగరపాలక సంస్థ... అక్రమాల అడ్డా... నెల్లూరు నగరం... అక్రమ నిర్మాణాల హబ్. ఈ రెండింటిని ఎవరూ మార్చలేరు. నెల్లూరు నగరంలో అక్రమ నిర్మాణాలను తొలగించాలనుకుంటే దాదాపు 70శాతం కట్టడాలను కూలగొట్టాల్సిందే! సక్రమ నిర్మాణాల కంటే అక్రమ నిర్మాణాలే ఇక్కడ ఎక్కువ!*

ఈమధ్య నెల్లూరులో అక్రమ నిర్మాణాలను కూలగొట్టాలంటూ టౌన్‌ప్లానింగ్ అధికారులు పెద్దఎత్తున హడావిడి చేయడం చూసాం. 2015 నుండి ఆన్‌లైన్‌లో అనుమతి పొంది, నిబంధనల ప్రకారం కట్టని 300 భవనాలను టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సర్వే ద్వారా గుర్తించి, వాటిని కూలగొట్టడానికి సిద్ధపడడం తెలిసిందే! ప్రజలతో ఏ మాత్రం సంబంధంలేని మున్సిపల్ మంత్రి నారాయణ ఈ పనికి పూనుకోవడం తెలిసిందే! జనం ఓట్లతో పనిలేని మనిషి కాబట్టి ఈ పని పెట్టుకోగలిగాడు. అయినా కూడా రెండు భవనాలపై గడ్డపారలు దిగగానే రాజకీయ ఒత్తిళ్లు ఎక్కువై ఆయన కూడా వెనక్కు తగ్గాల్సి వచ్చింది. దీంతో అక్రమ నిర్మాణాలను సక్రమం చేసుకోవడానికి అవకాశం కల్పిస్తూ బిపిఎస్‌కు అవకాశమిచ్చారు. అక్రమ భవనాలకు పెనాల్టీలు వేయాలని ఆదేశాలు రావడంతో నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆ మేరకు భవన నిర్మాణదారులకు పెనాల్టీ నోటీసులు పంపారు. ఆ నోటీసుల్లో వేసిన పెనాల్టీలు చూసి అందరికీ కళ్లు బైర్లు కమ్మాయి. భారీగా పెనాల్టీలు వేశారు. ఇంత పెనాల్టీలు కట్టేబదులు అప్రూవల్ ప్రకారం భవనాలు కట్టుకుని వుంటే పోయుండేదని అందరూ ఇప్పుడు బాధపడుతున్నారు. భవన యజమానులు ఇప్పుడు రెండు విధాలా నష్టపోతున్నారు. ఎందుకంటే అప్రూవల్‌కు విరుద్ధంగా భవనాలు కట్టేటప్పుడు అధికారులు, పాలకులకు లంచాల రూపంలో అంతో ఇంతో ఇచ్చుకున్నారు. ఇప్పుడు పెనాల్టీల రూపంలో మరికొంత నష్టపోవాల్సి వస్తోంది. మంత్రి నారాయణ మూలంగా ఒక అనుభవం మాత్రం నెల్లూరీయులకు వచ్చింది. అదేంటంటే... కట్టుకున్నకాడికి అప్రూవల్ ప్రకారమే భవనాలు కట్టుకుందాం... అతిక్రమణలు ఉండకూడదని. ఎందుకంటే ఈ టెన్షన్‌లన్నీ భరించే బదులు సక్రమంగా భవనాలు కట్టుకుంటే ఏ తలనొప్పి ఉండదు కదా!



- పెల్లుబుకుతున్న నిరసనలు

# కావలి మరో కొవ్వాడ కానుందా?

కేంద్రప్రభుత్వం రాష్ట్రంలో నిర్మించ తలపెట్టిన పెద్ద ఓడరేవుకు విశాఖ జిల్లా నక్కపల్లి, నెల్లూరుజిల్లా దుగరాజపట్నం, ప్రకాశం జిల్లా రామాయపట్నంలను ఎంపిక చేయడం తెలిసిందే! వివిధ కారణాలతో నక్కపల్లి, దుగరాజపట్నంలను పోర్టు నిర్మాణానికి నిరాకరించిన తర్వాత, రామాయపట్నంపై ఆశలు పెరిగాయి. పేరుకు రామాయపట్నం ప్రకాశం జిల్లాలో వున్నా దీని ప్రభావమంతా నెల్లూరుజిల్లాలోని కావలి పట్టణం మీద ఉంటుంది. ఓ దశలో రామాయపట్నం వద్దే పోర్టు వస్తుందన్న నమ్మకంతో కావలి చుట్టుపక్కల ప్రాంతాల రియల్టర్లు ఈ ప్రాంతంలో పెద్దఎత్తున భూములను కొనుగోలు చేసారు. ఆ తర్వాత పోర్టు రాక, కొన్న భూముల ధరలు పెరగక, తెచ్చిన అప్పుల మీద వడ్డీలు చెల్లించలేక రియల్టర్లు లబోదిబోమంటున్నారు. ఈ ఎపిసోడ్‌ను పక్కనపెడితే ఇప్పుడు పోర్టు రావడం మాట అటుంచి ఈ ప్రాంతంలో అణువిద్యుత్ కేంద్రం రానుందనే ప్రచారంతో కావలివాసుల గుండెల్లో గుర్రాలు పరుగెత్తుతున్నాయి. రష్యాకు చెందిన కంపెనీ ఇక్కడ అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. ఈమేరకు భూసేకరణ ఏర్పాట్లు కూడా జరిగినట్లు సమాచారం. అణు విద్యుత్ కేంద్రం వస్తే మొదట ప్రభావం భూముల మీదే పడుతుంది. ఈ ప్రాంతంలో ఒక్క సెంటు భూమిని కూడా కొనే వాడు ఉండడు. లక్షలు, కోట్లు పెట్టి భూములు కొన్న వాళ్లు నెత్తిన గుడ్డేసుకోవాల్సిందే! ఆ తర్వాత పైర్ల మీద కూడా ప్రభావం పడుతుంది. ఇక అణువిద్యుత్ ఉత్పాదన మొదలయ్యాక కాలుష్యం పెరిగి, రకరకాల సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఇక ఈ విద్యుత్ కేంద్రంలో ఊహించని ప్రమాదమేదన్నా జరిగితే జరిగే నష్టం కూడా ఊహలకందని విధంగానే ఉంటుంది. ఆర్థికంగానూ, ఆరోగ్య పరంగానూ అన్ని విధాలా చేటు తెచ్చే ఈ అణు విద్యుత్ కేంద్రం ఏర్పాటును అడ్డుకునేందుకు కావలి ప్రాంత ప్రజలు ఆందోళనలకు సైతం సిద్ధమవుతున్నారు. తమిళనాడులోని కూడంకుళం వద్ద, శ్రీకాకుళం జిల్లాలోని కొవ్వాడ వద్ద అణువిద్యుత్ ప్లాంట్లను నిరసిస్తూ అక్కడి ప్రజలు పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహించారు. ఈ ఆందోళనలు పోలీసుల కాల్పుల దాకా దారి తీసాయి. ప్రభుత్వం మొండిగా ఇక్కడే అణువిద్యుత్ కేంద్రం పెట్టాలనుకుంటే కావలి మరో కొవ్వాడగా మారినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో పాటు వామపక్షాలు, వివిధ ప్రజాసంఘాలు అణువిద్యుత్ ప్లాంట్‌కు వ్యతిరేకపోరుకు సన్నద్ధమవుతున్నాయి. 'అణు' ప్లాంటు విషయంలో ప్రభుత్వం ముందడుగు వేస్తే ఆందోళనలు తీవ్రమయ్యే అవకాశముంది.




# కలెక్టర్‌ను కలిసిన నగర ఎమ్మెల్యే



నెల్లూరు నగర శాసనసభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ సోమవారం కలెక్టర్ బంగ్లాలో నెల్లూరుజిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, నెల్లూరు నగరంలోని ప్రధాన సమస్యలను వివరించారు. బర్మాషెల్‌గుంట, రైల్వేట్రాకు ప్రక్కన నివాసం ఉంటున్న ప్రజలకు ఇతర ప్రాంతాల్లో నివాసస్థలం మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. బి.సి విద్యార్థుల స్కాలర్ షిప్‌లకు రేషన్‌కార్డు జత చేయాలనే నిబంధనతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రూప్‌కుమార్ యాదవ్, ఓబిలి రవిచంద్ర, ఊటుకూరు మాధవయ్య, ఎండి ఖలీల్, గోగుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పాలకవర్గాన్ని రద్దు చేయండి

**- ముక్కాల ద్వారకానాథ్**



ప్రజలకు ఉపయోగం లేని పాలకవర్గాన్ని రద్దు చేయాలని ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ అన్నారు. ఇటీవల కార్పొరేషన్ కార్యాలయంలోని డిప్యూటీ మేయర్ ఛాంబర్‌లో ద్వారకానాథ్ విలేకర్లతో మాట్లాడుతూ కమిషనర్, ఇతర అధికారుల సమన్వయలోపం కారణంగా పేద ప్రజలు ఇంటి దరఖాస్తులతో కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నగర మేయర్, మంత్రి తీరుతో నగరం అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. కార్పొరేటర్ రూప్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ కౌన్సిల్ అవినీతిపై విచారణ చేస్తామనే మేయర్ మాట నీటి మూటన్నారు. త్రిసభ్య కమిటీ ఏమైందని ప్రశ్నించారు. కౌన్సిల్‌ను నిర్వహించి పది నెలలు గడుస్తోందని, తక్షణమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్లు లేబూరు పరమేశ్వరరెడ్డి, ఓబిలి రవిచంద్ర, దామవరపు రాజశేఖర్, ఊటుకూరు మాధవయ్య, నాగరాజు, ఖలీల్ అహ్మద్, దేవరకొండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇస్కాన్ సేవలు ప్రశంసనీయం




సమాజహితానికి, జీవితంలో ఉన్నత స్థితికి ఎదిగేందుకు భగవద్ధ్యానం, ఆధ్యాత్మిక చింతన ఎంతో అవసరమని, విద్యార్థుల్లో భక్తితత్వం, సామాజిక స్పృహ కలిగించేందుకు అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) చేస్తున్న సేవలు ప్రశంసనీయమని నెల్లూరు రూరల్, నగర ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్‌లు పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీన నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులోని ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరుగనున్న నేపథ్యంలో ఆదివారం విద్యార్థులకు దేవతామూర్తులు, ధార్మిక పాత్రలు, ఫ్యాన్సీ, డ్రెస్, చిత్రలేఖనం, పాటలు, సంగీతం, సృజనాత్మక చిత్రాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు వీటిని ప్రారంభించారు. ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవస్వామి మాట్లాడుతూ మానవజన్మ అంటే కేవలం తినడం, నిద్రపోవడం కాదని, భగవంతుడ్ని తెలుసుకోవడమేనన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. విద్యార్థుల్లో భక్తి భావాన్ని, భగవత్ చింతన కలిగించేందుకు పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం శ్రీకృష్ణతత్వాన్ని వివరిస్తూ నిర్వహిస్తున్న ప్రపంచ హరినామ వారోత్సవాల ఫ్లకార్డులను ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు. చిన్నారులకు నిర్వహించిన దేవతామూర్తుల వేషధారణ పోటీలు ఆకట్టుకున్నాయి.

### పుష్కరాలతో
# పోలీస్ గ్రీవెన్స్ బంద్!

జిల్లా ఎస్పీతో పాటు ఇతర పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బందికి కృష్ణపుష్కరాలు డ్యూటీ వల్ల మొన్న సోమవారం నిర్వహించాల్సిన గ్రీవెన్స్‌ను రద్దు చేశారు. ఎస్పీకి అక్కడ కమాండ్ కంట్రోల్ బాధ్యతలు అప్పగించడం జరిగింది. ఈ విషయం తెలియక బాధితులు ఎప్పటిలానే సోమవారం పోలీసుగ్రౌండ్‌కు చేరుకున్నారు. వచ్చినవారి సమస్యలను అక్కడున్న అధికారులు విని ఆయా స్టేషన్‌లకు ఆ కేసులను పరిష్కరించమని ఆదేశించారు. తదుపరి సోమవారం మాత్రం గ్రీవెన్స్‌డే యధాతధంగా జరుగుతుందని పోలీసు అధికారులు తెలిపారు.

### నగరపాలక సంస్థకు
# రూ.39.58కోట్లు

నెల్లూరు నగరపాలక సంస్థకు రూ.39.83కోట్లు మంజూరయ్యాయి. గత కొంతకాలంగా ఎదురుచూస్తున్న ఎస్సీ, ఎస్టీ, సబ్‌ప్లాన్ నిధులను విడుదల చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నెల్లూరు నగరంలోని ఎస్సీ, ఎస్టీ ప్రాంతాలు అభివృద్ధి కానున్నాయి. ఈ నిధుల కోసం తొలుత నగరంలో సర్వే నిర్వహించారు. ఏయే డివిజన్లలో ఎస్సీ, ఎస్టీలు ఉన్నారో అధికారుల ద్వారా తనిఖీలు నిర్వహించి అనంతరం ప్రతిపాదనలు పంపారు. దీంతో పలువురు కార్పొరేటర్లు నాయకులపై ఒత్తిళ్ళు తెచ్చి తమ డివిజన్‌కే ఎక్కువ నిధులు కేటాయించాలంటూ పట్టుపట్టగా కమిటీ ఏర్పాటు చేసి సర్వే నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు సంబంధించి రూ.42కోట్లు విడుదల అవ్వాల్సి ఉండగా రూ.39.58 కోట్లకు ప్రతిపాదనలు పంపారు. పంపిన ప్రతిపాదనలన్నీ సాంకేతిక విభాగం మంజూరు చేసింది. మిగతా రూ.2.42 కోట్లకు సంబంధించి అధికారులు ప్రతిపాదనలు పంపాల్సివుంది. ఇవి కూడా త్వరలో మంజూరు అవుతాయని, వెంటనే వాటికి కూడా టెండర్లు పిలువనున్నామని అధికారులు తెలిపారు.

### పుష్కరాలకు
# 250 ప్రత్యేక బస్‌లు

కృష్ణా పుష్కరాలకు నెల్లూరు రీజియన్ నుంచి 250 బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసి నెల్లూరు రీజనల్ మేనేజర్ రవివర్మ పేర్కొన్నారు. ఇటీవల ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నెల్లూరు నుంచి విజయవాడకు 150 బస్సులు పంపుతున్నామని, నెల్లూరు యాత్రికుల కోసం అన్ని డిపోల నుంచి 100 ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. నెల్లూరు, ప్రకాశం, తిరుపతి నుంచి వచ్చే బస్సులు రద్దీవల్ల గోరంట్ల వరకు వెళ్తాయని, యాత్రికులు గోరంట్ల వద్ద వున్న బేస్‌క్యాంప్ నుంచి ఘాట్లకు ఏర్పాటుచేసిన ప్రత్యేక సిటీ బస్సుల ద్వారా వెళ్ళి, తిరిగి అక్కడికే వచ్చి బస్సులు ఎక్కాలని ఆయన సూచించారు.

ఆధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## నెల్లూరు కబుర్లు

# పుష్కర ప్రయాణాలు

చంద్రబాబు పబ్లిసిటీ పుణ్యమా అని నెల్లూరుజిల్లాలోనూ పుష్కరాల ఫీవర్ ఎక్కువైంది. కృష్ణ పుష్కరాలకు వెళ్లేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల ప్రలు సన్నద్ధమవుతున్నారు. గోదావరి పుష్కరాలంటే పెద్ద ప్రయాస. రాను, పోను అక్కడ మునగడానికి, నిద్రపోవడానికి రెండ్రోజులు పని. కాని కృష్ణ పుష్కరాలు ఒక్క రోజులో చూసుకోవచ్చు. ఉదయాన్నే బయలుదేరితే మధ్యాహ్నం లోపే విజయవాడ చేరుకుని కృష్ణా నదిలో మునిగి, తిరిగి రాత్రికల్లా నెల్లూరుకు చేరుకోవచ్చు. జిల్లా నుండి విజయవాడకు రోడ్డు, రైలు రవాణా సౌకర్యవంతంగా వుంది. దాంతో కృష్ణ పుష్కరాల ఘాట్లు కర్నూలు నుండి ముంగినపూడి బీచ్ వరకు వున్నా ఎక్కువమంది విజయవాడకే వెళుతున్నారు. ఈమేరకు ఏర్పాట్లు కూడా చేసుకుంటున్నారు.

# పోలీసు వైద్యానికి కొత్త ఆసుపత్రుల పరిశీలన



వైద్య పరికరాలను పరిశీలిస్తున్న బాలకృష్ణ

పోలీసుల ఆరోగ్యభద్రత లోకి కొత్త ఆసుపత్రులను చేర్చేందుకు ఆరోగ్య భద్రత కార్యదర్శి బాలకృష్ణ, వైద్యాధికారి సాయిబాబా ఆధ్వర్యంలో సోమవారం నెల్లూరు నగరంలోని పలు ఆసుపత్రులను పరిశీలించారు. నెల్లూరులో అపోలో, మాదరన్ ఐ ఆసుపత్రి, కేర్ డెంటల్, హ్యాపీ డెంటల్, ఇందిరా డెంటల్, లోటస్ డెంటల్, దివీస్ డెంటల్, అపోలో డెంటల్, నాయుడుపేటకు చెందిన యుగంధర్ డెంటల్ ఆసుపత్రులను తనిఖీ చేశారు. వీటిలో అన్ని వసతులు ఉన్నాయని, సంతృప్తి వ్యక్తం చేసినట్లు పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు మద్దిపాటి ప్రసాదరావు తెలిపారు. త్వరలోనే ఆయా ఆసుపత్రులన్నీ ఆరోగ్య భద్రతలోకి చేరనున్నాయని పేర్కొన్నారు. అపోలో, మాదరన్ ఐ ఆసుపత్రులలో పోలీసులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ తనిఖీల్లో ఏఆర్ డిఎస్పీ చెంచురెడ్డి, బెటాలియన్ అధ్యక్షులు కొండారెడ్డి పాల్గొన్నారు.

# బిజిఆర్ కాలేజీలో బెగోరె జన్మదిన వేడుకలు




నెల్లూరులోని బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 5వ తేదీ మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ బెజవాడ గోపాలరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త డా॥ అనుమకొండ జగదీష్, ప్రముఖ సంఘసంస్కర్త గణేశం కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జె.వి.రెడ్డి మాట్లాడుతూ బెజవాడ గోపాలరెడ్డి మహిళా అభ్యుదయం కోసం ఈ కళాశాలను స్థాపించారని అన్నారు. ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా, కేంద్ర ఆర్థికమంత్రిగా, సాహితీవేత్తగా ఆయన చేసిన సేవలను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం ఫ్రెషర్స్‌డే సందర్భంగా సీనియర్ విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులను స్వాగతించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పూర్వప్రిన్సిపాల్ రాఘవరెడ్డి, రెడ్‌క్రాస్ సెక్రటరీ ఎ.వి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



నెల్లూరు విఆర్ హైస్కూల్లో 1966వ సంవత్సరం పన్నెండవ తరగతి చదివిన విద్యార్థులు ఈ నెల 7న ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 50ఏళ్ల తర్వాత నెల్లూరు ట్రంకురోడ్డులోని టివిఎస్ కళ్యాణసదన్‌లో కలుసుకుని తమ చిన్ననాటి ముచ్చట్లను, జ్ఞాపకాలను పంచుకున్నారు. తమ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఈ విద్యాసంవత్సరం విఆర్ పాఠశాలలో పదవ తరగతిలో స్కూల్ ఫస్ట్ వచ్చిన చింతారెడ్డిపాలెంకు చెందిన చరణ్ అనే విద్యార్థికి పూర్వవిద్యార్థులు రూ. 8వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమం పూర్వవిద్యార్థులు బాలసుబ్రహ్మణ్యం, సాయి, విజయకుమార్‌రెడ్డి, పుట్టా శేషారెడ్డి, సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. 35మంది పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యాశాఖకు మళ్ళీ వివాదాస్పదుడు



ఎక్కడ పనిచేస్తున్నా వివాదాలను తన కేరాఫ్ అడ్రస్‌గా మలచుకున్న మువ్వా రామలింగం మళ్ళీ నెల్లూరు జిల్లా విద్యాశాఖాధికారిగా వచ్చాడు. పైస్థాయిలో పైరవీలు జరిపి, విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆశీస్సులతో పట్టుబట్టి మళ్ళీ ఆయన ఈ జిల్లాకే రాగలిగాడు.

ఎక్కడున్నా విద్యాశాఖను భ్రష్టు పట్టించడంలో మువ్వా రామలింగంకు ప్రత్యేకమైన పేరుంది. పదిహేనేళ్ల క్రితమే ఆయన ఇక్కడ డిప్యూటీ డిఇఓగా పనిచేస్తూ ఎన్నో వివాదాలకు కేంద్రబిందువుగా మారాడు. సంతపేటలోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌నే కార్యాలయంగా మార్చుకుని ఎన్నో అక్రమాలకు తెరతీశాడు. ఆయనకు వ్యతిరేకంగా అప్పుడే ఉపాధ్యాయ సంఘాలు పెద్దఎత్తున ఆందోళనలు జరిపాయి. డిఇఓగా పదోన్నతి పొందిన తర్వాత చిత్తూరుజిల్లాలో డిఇఓగా పని చేశాడు. ఈయన అక్రమాల దెబ్బకు అక్కడ జడ్పీ పాలకవర్గ సభ్యులు ఇతని మీద జడ్పీ సమావేశంలో ప్రత్యేకంగా తీర్మానం పెట్టించి బదిలీ చేయించారు. ఆ తర్వాత 2007లో గుంటూరు డిఇఓగా, 2008లో కర్నూలు డిఇఓగా పని చేశాడు. గుంటూరులో లంచం తీసుకుంటూ ఏసిబికి పట్టుబడ్డాడు. కర్నూలులోనూ ఉపాధ్యాయ సంఘాలతో గొడవలు పడ్డాడు. కొంతకాలం ఆయనకు పోస్టింగ్ ఇవ్వలేదు. 2011 జూన్‌లో నెల్లూరు డిఇఓగా వచ్చాడు. 2014 ఏప్రిల్ దాకా పని చేశాడు. ఈమధ్య కాలంలో ఉపాధ్యాయులకు, ఉపాధ్యా సంఘాలకు చుక్కలు చూపించాడు. రామలింగం ఇక్కడున్నంతకాలం కూడా ఆయనకు వ్యతిరేకంగా ఏదో ఒక ఉపాధ్యాయ సంఘం ఆయనకు వ్యతిరేకంగా ఆందోళన జరిపింది. ఈయన అక్రమాలపై విచారణ జరిపించి అప్పటి కలెక్టర్ శ్రీకాంత్ ఇతనిని ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఏడాది పాటు సస్పెన్షన్‌లో వున్న రామలింగం ఆ తర్వాత ప్రకాశం డిఇఓగా పోస్టింగ్ తెచ్చుకున్నాడు. ఆ తర్వాత అక్కడా గొడవపడి మున్సిపల్ స్కూల్స్, ఐఐటి ఫౌండేషన్ కోర్సు ఏఓగా బదిలీ అయ్యాడు. గత కొంత కాలంగా ఆయన తిరిగి నెల్లూరుకు రావడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. విద్యామంత్రి గంటా శ్రీనివాసరావుతో ఆయనకు మంచి సంబంధాలున్నట్లు తెలుస్తోంది. విద్యాశాఖ మంత్రిగా గంటా నెల్లూరు జిల్లాకు తొలి సారి వచ్చినప్పుడు 'మీ మిత్రుడు' పేరుతో జిల్లాలో ఆయనకు భారీఎత్తున స్వాగతం ఫ్లెక్సీలు పెట్టించింది కూడా మువ్వా రామలింగమేనని సమాచారం. జిల్లాలో ఉపాధ్యాయ సంఘాలు, ఆఖరకు జిల్లా తెలుగుదేశం నాయకులు పెద్దఎత్తున వ్యతిరేకిస్తున్నా గంటా ఆశీస్సులతో మువ్వా రామలింగం నెల్లూరుకు రావాలన్న పంతం నెగ్గించుకున్నాడు. కాకపోతే జిల్లాలోని ఉపాధ్యాయులకు, ఉపాధ్యాయ సంఘాలకే ఇక మనశ్శాంతి ఉండదు.

## కంటి వ్యాధిగ్రస్తులకు వరంగా...

# అగర్వాల్స్ నేత్ర వైద్యశాల



నెల్లూరులో లలిత 'ఐ' క్లినిక్ ఆసుపత్రి అధినేతగా, క్లాసిక్ లేజర్ వైద్యాన్ని ప్రారంభించిన తొలి కంటి వైద్య నిపుణుడిగా పేరుగాంచిన డాక్టర్ బి.శివప్రతాప్‌రెడ్డి నేతృత్వంలో, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అగర్వాల్స్ గ్రూప్ ఆఫ్ ఐ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నెల్లూరు, దర్గామిట్టలో నిర్మించబడ్డ అగర్వాల్స్ నేత్ర వైద్యశాలను ఈ నెల 9వ తేదీన ప్రముఖ సినీ హీరోయిన్ రెజీనా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, మేయర్ అబ్దుల్ అజీజ్, కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాసయాదవ్, పి.రూప్‌కుమార్‌యాదవ్, నూనె మల్లిఖార్జున యాదవ్, డి.రాజానాయుడులు కూడా పాల్గొన్నారు. అగర్వాల్స్ గ్రూప్ ఆఫ్ ఐ హాస్పిటల్స్ డైరక్టర్ డాక్టర్ అదిల్ అగర్వాల్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ బి.శివప్రతాప్‌రెడ్డిలు అతిథులకు స్వాగతం పలికి, ఆసుపత్రిలోని అత్యాధునిక వైద్య సేవలను గురించి వారికి వివరించారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేద, మధ్య తరగతి రోగులకు కూడా అందుబాటులో ఉండేలా వైద్యసేవలందించాలని, పేద విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించాలని కోరారు. హీరోయిన్ రెజీనా ఈ సందర్భంలోనే మరణానంతరం తన నేత్రాలను దానం చేస్తూ అంగీకారపత్రాలపై సంతకం చేశారు. ఒక మంచి నేత్ర వైద్యశాలను నెల్లూరులో నెలకొల్పిన అదిల్ అగర్వాల్‌కు, ఈ ఆసుపత్రిని నెల్లూరుకు తీసుకు రావడంలో కృషి చేసిన బి.శివప్రతాప్‌రెడ్డికి 'లాయర్' అభినందనలు.

# అంశాలను వెంటనే అమలు చేయండి

- జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు



ఒక సమావేశం జరిగినప్పుడు దాని సారాంశం గురించి తయారుచేసిన మినిట్స్ వెంటనే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు అన్నారు. మంగళవారం కలెక్టర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వివిధ సెక్షన్ల పర్యవేక్షకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సమావేశం జరిగిన తరువాత దానిలోని అంశాలను త్వరితగతిన అమలు చేసేలా సంబంధిత పర్యవేక్షకులు సంబంధిత శాఖాధికారులతో ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకోవాలన్నారు. ఉద్యోగస్తులు ఉద్యోగం చేస్తూ చనిపోతే సదరు చనిపోయిన ఉద్యోగి కుటుంబానికి మూడు నెలలోపు ఉద్యోగం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో బాధపడవలసి వస్తుందని, ఈ విషయంపై సంబంధిత జిల్లా శాఖాధికారుల నుండి నివేదికను నెలకొకసారి తెప్పించుకోవాలని ఆదేశించారు. అదే విధంగా నేషనల్ ఫ్యామిలి బెనిఫిట్స్ స్కీం గురించి మాట్లాడుతూ సంబంధిత కుటుంబాల వారికి ఆర్థిక సహాయం అందేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మార్కండేయులు, కలెక్టర్ కార్యాలయపు సెక్షన్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

# ఉన్నది ఉన్నట్లు చెప్పండి

- నెల్లూరు జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి



నెల్లూరుజిల్లా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 6వ తేదీ రసవత్తరంగా స్టాండింగ్ కమిటి సమావేశాలు జరిగాయి. ఉన్నది ఉన్నట్లు చెప్పండి, నిజాలు దాచకండి అంటూ జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మత్స్యశాఖ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బొమ్మిరెడ్డి, సభ్యులు అడిగిన ప్రశ్నలకు మత్స్యశాఖ అధికారులు డీలాపడ్డారు. మత్స్యశాఖపై చర్చ జరిగే సమయంలో సభ్యులందరూ ఏకకంఠంతో మత్స్యశాఖ ఏడిని నిలదీశారు. జడ్పీ నుంచి ఎస్టీ మత్స్యకారులకు వలలు, సైకిళ్లు పంపిణీ చేయమని 90శాతం రాయితీతో జడ్పీ నిధులు కేటాయించిందని, వీటిని దారి మళ్లించి ఎస్టీ మత్స్యకారులకు ఎక్కడా సైకిళ్లు ఇవ్వలేదని కలువాయి జడ్పీటీసీ సభ్యుడు అనిల్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తమ సభ్యులు అనుమతి లేకుండా పాలనాధికారి పేరు చెప్పి ఇతర వేదికలపైన మత్స్యకారులకు సైకిళ్లు ఎలా కేటాయించారని ఏడిని నిలదీశారు. వెంటనే కొడవలూరు, దుత్తలూరు, దక్కిలి జడ్పీటీసీ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, మల్లిఖార్జున, రామచంద్రనాయుడు ఒక్కసారిగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మత్స్యశాఖ ఏడి స్పందిస్తూ తాజాగా 749 ఎస్టీ లబ్దిదారులకు సైకిళ్ళు, వలలు మంజూరయ్యాయని, ఆగస్టు 15న ఇస్తామని నచ్చచెప్పారు.

# హోదా వచ్చేదాకా పోరాటం ఆపం!





కాంగ్రెస్‌పార్టీ గత రెండు సంవత్సరాలుగా అనేక ఉద్యమాలు, ధర్నాలు, ర్యాలీలు చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేకహోదా కోసం శ్రీకారం చుట్టిందని డిసిసి అధ్యక్షులు పనబాక కృష్ణయ్య పేర్కొన్నారు. 1942 ఆగస్టు 9న అఖిల భారత కాంగ్రెస్ క్విట్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ నేతృత్వంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా క్విట్ ఇండియా ఉద్యమం మొదలు పెట్టిన రోజును పురస్కరించుకుని మంగళవారం నెల్లూరుజిల్లా కాంగ్రెస్ కమిటి ఆధ్వర్యంలో ఇందిరాభవన్‌లో సేవాదళ్ ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణలో డిసిసి అధ్యక్షులు పనబాక కృష్ణయ్య వందనం స్వీకరించి ర్యాలీగా మహాత్మాగాంధీ విగ్రహం వరకు నిరసనగా ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏపిసిసి నెల్లూరుజిల్లా ఇన్‌ఛార్జి బి.చెంగల్‌రాయుడు, కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి పాల్గొన్నారు. గాంధీ విగ్రహం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టిన అనంతరం డిసిసి అధ్యక్షులు పనబాక కృష్ణయ్య మాట్లాడుతూ పార్లమెంటులో ప్రైవేటు బిల్లు పెడితే బీజేపీ, టీడీపీ పార్టీలు దాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యసభలో మాజీ ప్రధానమంత్రి డా॥ మన్మోహన్‌సింగ్ ఈ నెల 5న రాజ్యసభలో స్వయంగా మాట్లాడి తాను ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరినా, అమలు చేయకపోవడం బీజేపీ, టీడీపీ అప్రజాస్వామిక పాలనా నైజానికి నిదర్శనమన్నారు. కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడానికి 14వ ఆర్థిక సంఘం సిఫారసులు అనుమతించలేదని అరుణ్ జైట్లీ చెప్పడం సవరణను తప్పుదోవ పట్టించడమేనన్నారు. 14వ ఆర్థిక సంఘం ఎక్కడా ఏపికి ప్రత్యేకహోదా ఇవ్వద్దని చెప్పలేదని ఆధారాలతో సహా కాంగ్రెస్ రాజ్యసభ సభ్యులు జైరాంరమేష్ చెప్పారన్నారు. ఏపిసిసి నెల్లూరుజిల్లా ఇన్‌ఛార్జి బి.చెంగల్‌రాయుడు మాట్లాడుతూ రాజ్యసభలో ఉపసభాపతి కురియన్ కె.వి.పి బిల్లును లోక్‌సభ నిర్ణయానికి పంపుతున్నామని ప్రకటించగానే బీజేపీ మంత్రులు, టిడిపికి చెందిన కేంద్రమంత్రి సుజనా చౌదరి చప్పట్లుకొట్టి బల్లలు చరచడం ఎంత విద్రోహమో తేటతెల్లం అవుతుందని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సి.వి.శేషారెడ్డి, చేవూరు దేవకుమార్‌రెడ్డి, చెంచలబాబుయాదవ్, షేక్ ఆసిఫ్‌బాషా, గాలాజు శేషాచారి, శీలం తిరుపతయ్య, బెజవాడ గోవిందరెడ్డి, ఎల్.సురేష్‌బాబు, పత్తి సీతారాంబాబు, నవీన్‌బాబు, అనురాధారెడ్డి, లతారెడ్డి, కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ వైభవం...!



టిటిడి అన్నమాచార్య ప్రాజెక్ట్ మాజీ డైరెక్టర్, తెలుగు శ్రీనివాస వాఙ్మయ అధ్యయన సంస్థ ప్రత్యేకాధికారి, ప్రముఖ సహస్రావధాని డా॥ మేడసాని మోహన్ - డా॥ అరుణజ్యోతిల కుమార్తె **డా॥ హిమబాల - డా॥ సందేశ్** (హైదరాబాద్ వాస్తవ్యులు డా॥ పి.సతీష్‌కుమార్ - మాధవిల కుమారుడు)ల పెళ్ళి ఈ నెల 3వ తేదీ తిరుపతిలోని పిఎల్ఆర్ కన్వెన్షన్ హాల్ నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాభినందనలు.



నారాయణ ఆసుపత్రి ఏజిఎం చౌకచర్ల భాస్కర్‌రెడ్డి - ప్రవీణల కుమార్తె **శ్రీకరణి - సత్యదీపక్‌రెడ్డి** (వరిగొండ వాస్తవ్యులు చింతంరెడ్డి దశరథరామిరెడ్డి - ప్రసూనల కుమారుడు)ల కళ్యాణం ఈ నెల 7వ తేదీ నెల్లూరులోని అనిల్‌గార్డెన్స్‌లో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.



సీనియర్ పాత్రికేయులు కె.వి.రమణయ్య మనుమరాలు, కనుపర్తి రామకృష్ణ ప్రసాద్ - మీనాక్షి సుందరిల కుమార్తె **మృదుల - వెంకటేష్‌బాబు** (గొలగమూడి వాస్తవ్యులు తోరాహతుల రమేష్‌బాబు - నీరజల కుమారుడు)ల వివాహం ఈ నెల 7వ తేదీ నెల్లూరులోని ఎం.సి.ఎస్. కళ్యాణ మండపంలో జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభదీవెనలు.



నెల్లూరు వాస్తవ్యులు అళహరి రమేష్ - రాధికల కుమార్తె **వైష్ణవి - శ్రీకాంత్** (విజయనగరం జిల్లా తోటపాలెం వాస్తవ్యులు బరిగెడ భాస్కరరావు - నాగవేణిల కుమారుడు)ల పరిణయం 7వ తేదీ తెల్లవారుజామున నెల్లూరులోని ఎం.వి.ఎస్. కళ్యాణ మండపం నందు జరిగింది. కొత్త దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# రైల్వే ఫ్లైఓవర్‌కి మోక్షమెప్పుడో?



## గూడూరు డివిజన్ వార్తలు

తూర్పు-పడమర గూడూరులను కలిపే రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జికి మోక్షమెప్పుడని పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్నారు. దశాబ్దాల కాలంగా ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని పట్టణ వాసులు ఆకాంక్షిస్తున్న తరుణంలో 2011 మే 5వ తేదీన బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రాజెక్టు విలువ రూ.39కోట్లతో 2014 మే నాలుగో తేదీకి పూర్తి చేసేలా నిర్మాణం చేపట్టారు. దీంతో పట్టణ ప్రజలు తమ చిరకాల కోరిక నెరవేరుతుందని ఆశించారు. గూడూరు పట్టణం వైపు 650 మీటర్లు, జయంపు మార్గం వైపు 77మీటర్లు, అడవికాలనీ వైపు 475మీటర్లు పొడవునా బ్రిడ్జి నిర్మాణం రూపుదిద్దుకోనుంది. దీంతో పట్టణ ప్రజలకే కాకుండా మండల ప్రాంత ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఈ క్రమంలో నిర్మాణ పనులు వేగవంతంగా సాగాయి. రైలు పట్టాలపై నిర్మాణాలు 85శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులు 60శాతం వరకు పూర్తయ్యాయి. రెండేళ్ల క్రితం నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచాయి. అందుకు కారణం భూసేకరణలకు నిధులు మంజూరు కాలేదని అధికారులు వెల్లడించారు. అదేవిధంగా ప్రాజెక్టుకు అవసరమైన ప్రాంతాల్లోని ఆక్రమణల తొలగింపు, కరెంటు పోల్స్ ఏర్పాటు, సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయాల్సి వుంది. ఇకనైనా అధికారులు చొరవచూపి ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# క్రీడా మైదానాల అభివృద్ధికి చర్యలు

**- శాప్ ఛైర్మెన్ మోహన్**



రాష్ట్రంలో రూ.250కోట్ల నిధులతో క్రీడా మైదానాల అభివృద్ధి, ఇతర సౌకర్యాలు కల్పనకు ప్రణాళికలను సిద్ధం చేసినట్లు శాప్ ఛైర్మెన్ పిఆర్ మోహన్ తెలిపారు. ఇటీవల ఆయన రియో ఒలంపిక్స్ కార్యక్రమం నిమిత్తం తిరుపతి నుంచి విజయవాడ వెళ్తూ మార్గమధ్యలో గూడూరులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించే క్రమంలో క్రీడా అకాడమీలు, ఇండోర్ స్టేడియాలు అసంపూర్తిగా ఉన్న 50ప్రాంతాల్లో క్రీడాభివృద్ధికి చర్యలు చేపట్టినట్టు తెలిపారు. నూతన రాజధాని అమరావతిలో 150ఎకరాల్లో రూ.100కోట్లతో క్రీడా యూనివర్శిటీ ఏర్పాటుకు కేంద్రం నుంచి అనుమతి వచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే శాప్ నిధుల నుంచి రూ.6కోట్లను పరిహారం పంపిణీ అందించినట్లు చెప్పారు. ఉమెన్ హాకీ టీంలో గోల్‌కీపింగ్ కోచ్‌లు రియోకు వెళ్తున్నట్లు, ప్రస్తుతం జరుగుతున్న ఒలింపిక్స్ 31వదిగా వివరించారు. రియోలో పాల్గొనే ప్రతి క్రీడాకారునికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసంఘం గూడూరు శాఖ అధ్యక్ష, ఉపాధ్యక్షులు వై.చలపతిరావు, ఆనిమెళ్ళ శివకుమార్ పాల్గొన్నారు.

### ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల ఆధ్వర్యంలో

# గర్భిణీ మహిళలకు పోషకాహారం



గర్భిణులకు పోషకాహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ సి.రోహిణి, స్నేహలతారెడ్డి

గూడూరు ప్రాంతీయ వైద్యశాలలో మంగళవారం ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల ఆధ్వర్యంలో గర్భిణులు, మహిళలకు పోషకాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు స్నేహలతారెడ్డి పాల్గొని మాట్లాడుతూ గర్భిణుల్లో రక్త శాతం పెరిగేందుకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం తప్పనిసరి అని అన్నారు. సురక్షితంగా ప్రసవాలు అయ్యేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్‌పర్సన్ డాక్టర్ బి.ఆర్.జోత్స్నలత, డాక్టర్ చంద్ర, క్లబ్ ప్రతినిధులు లక్ష్మి విష్ణువందన, పట్టణ సిడిపివో ఉమామహేశ్వరి పాల్గొన్నారు.



ఈ నెల 5వ తేదీన 23వ వార్డులో 2లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, కార్యక్రమంలో పాల్గొన్న వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, కౌన్సిలర్ చెంచురామయ్య, మాజీకౌన్సిలర్ నేరేళ్ళ వెంకటరత్నం, ఆనిమెళ్ళ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. భారీగా పెట్టుబడులు పెట్టవద్దు. ప్రముఖులను, ముఖ్యవ్యక్తులను కలుసుకొంటారు. విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలుంటాయి. అధికారులకు స్థానచలనము కలదు. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసికొనవద్దు. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. వృత్తి ఉద్యోగ బాధ్యతలలో జాగ్రత్తగా ఉండండి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత, కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం, శుభకార్యాలలో పాల్గొనడం ఉంటుంది. ఉద్యోగులకు మంచి సమర్థత గౌరవాలుంటాయి. కళాక్రీడా శాస్త్ర సాంకేతిక రంగాల వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. కుటుంబంలో మీ బాధ్యతలు పెరుగుతాయి. ఆరోగ్యం బాగుంటుంది. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్థ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఉద్యోగులు పబ్లిక్‌తోను, క్రిందిస్థాయి ఉద్యోగులతోను జాగ్రత్తగా మెలగండి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ చూపాలి. కొత్త వస్తువులు గృహోపకరణలు కొంటారు. పనులు ఆలస్యమైనను అనుకూలించగలవు. ఖర్చుల భారం పెరుగుతుంది. చేబదుళ్ళు ఋణం చేయవలసి రావచ్చును. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా ఉండి, సామాన్య ఆదాయం ఉంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

పెట్టుబడుల విషయంలో అగ్రిమెంట్లు కుదురుతాయి. శుభకార్యాలు నిర్ణయం కావడం, గృహ నిర్మాణాల వంటివి వేగంగా జరగడం ఉంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగి ఆదాయం పెరుగుతుంది. కుటుంబ వ్యవహారాలు కొలిక్కి వస్తాయి. ఏ విషయంలో కాని చేసే ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. షేర్ల యందు లాభాలుంటాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలుంటాయి. పనులందు టెన్షన్ పడకుండా జాగ్రత్తగా నిర్వహించండి. శుభకార్యాల ఖర్చులుంటాయి. నిర్మాణాలు నిదానంగా జరుగుతాయి. గృహ వస్తు వాహన రిపేర్లుండగలవు. విద్యార్థులు ఉన్నత కోర్సులకు సిద్ధపడతారు. వ్యాపార రంగంలో పురోభివృద్ధి రాబడి బాగుంటుంది. అనుకున్న పనులు ఆటంకాలు కలిగినా నెరవేరుతాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

బంధువర్గంతో సమస్యలు రావచ్చును. ఆర్థిక కుటుంబ సమస్యలు కొద్దిగా ఉండి చికాకు పరుస్తాయి. మిత్రుల సహకారం పొందుతారు. స్థిరాస్తులపై రాబడి ఉంటుంది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా ఉండి రాబడి విషయంలో అసంతృప్తి ఉంటుంది. రాజకీయ వర్గాలకు మార్పులు, ఒత్తిడి ఉంటుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 12.8.2016 నుండి
తేది. 18.8.2016 వరకు

ఈ వారం సింహంలో బుధ శుక్రరాహువులు, కన్యలో గురువు, వృశ్చికంలో శని కుజులు, కుంభంలో కేతువు, 17తేది నుండి సింహంలో రవి, వృశ్చిక ధనుర్మకర కుంభ రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 12 శక్రవారం వరలక్ష్మి వ్రతం. కృష్ణా పుష్కరాలు ప్రారంభం. తేది 15 సోమవారం భారత స్వాతంత్ర్య దినోత్సవం. శ్రావణ పూర్ణిమ.

### మహూర్తములు

14 తేది ఆదివారం ఉ॥ 8.10 నుండి 10.20లోగా కన్యా లగ్నమున వివాహ వ్యాపారములు. 18 తేది గురువారం ఉ॥ గం.7.50 నుండి 10.0లోగా కన్యా లగ్నమున గృహారంభ వ్యాపార వివాహములు.

### శ్రావణ మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 12 | శుక్ర | నవమి | ప॥ గం.12.20వ॥ |
| తేది. 13 | శని | దశమి | ప॥ గం.1.57వ॥ |
| తేది. 14 | ఆది | ఏకాదశి | సా॥ గం.3.12వ॥ |
| తేది. 15 | సోమ | ద్వాదశి | సా॥ గం.3.56వ॥ |
| తేది. 16 | మంగళ | త్రయోదశి | సా॥ గం.4.13వ॥ |
| తేది. 17 | బుధ | చతుర్ధశి | సా॥ గం.3.57వ॥ |
| తేది. 18 | గురు | పూర్ణిమ | ప॥ గం.3.12వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

శుభకార్య ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. బంధువుల రాకపోకలు పెరుగుతాయి. వ్యాపార ఒప్పందాలు జరుగగలవు. ఉద్యోగులకు అధికారులతో సత్సంబంధాలుంటాయి. అనుకోని ప్రయాణాలుంటాయి. సేవా సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొంటారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు దొరకుతాయి. హామీలు, ఋణాలు ఇవ్వవద్దు. వృత్తి ఉపాధి రంగాలలో నిలద్రొక్కుకుంటారు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వ్యాపారవర్గాలకు ఆశించిన అభివృద్ధి ఆదాయం ఉండదు. కోర్టు కేసులందు ఆలస్యం జరుగుతుంది. అనవసర విషయాలలోకి మిమ్మల్ని లాగాలని చూస్తారు. జాగ్రత్త పడండి. దూరప్రయాణాలుంటాయి. శుభవార్తలు వింటారు. ప్రభుత్వ పరమైన పనులందు ఆలస్యం జరుగుతుంది. తొందరపాటు లేకుండా సంప్రదించి, ఆలోచన చేసి నిర్ణయాలు తీసుకొనండి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

స్థిరాస్తుల కొనుగోలుకు అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వ అనుమతులు, ఋణాలు మంజూరు కాగలవు. ఉద్యోగులకు మంచి గుర్తింపు గౌరవాలు, నిరుద్యోగులకు అవకాశాలు దొరకగలవు. శుభకార్యాలలో మీ ప్రమేయం ఉండి నిర్ణయం కాగలవు. బిడ్డల వల్ల చిన్న సమస్యలుంటాయి. ఆర్థికంగా నిలద్రొక్కుకుంటారు. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలుంటాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

కొత్త వ్యాపారాలకై ప్రయత్నాలు జరుగుతాయి. అధికారులకు స్థానమార్పులు, ఉద్యోగులకు గుర్తింపు, సమర్థత బాగుంటుంది. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత, కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఆర్థిక ఒప్పందాలలో జాగ్రత్త వహించండి. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

స్థిరాస్తులు కొనే ప్రయత్నాలు జరుగవచ్చును. రావలసిన బాకీలు, ప్రభుత్వ అనుమతులు లభించగలవు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఆకస్మిక ప్రయాణాలుంటాయి. బలహీనతలకు అలవాట్లను అదుపులో ఉంచండి. కొత్త వస్తువులు కొంటారు. అనుకున్న పనులు టెన్షన్ పెట్టినా విజయవంతంగా జరుపుతారు. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరుకుతాయి. ఉద్యోగులకు బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనుకున్న పనులను విజయవంతంగా పూర్తి చేస్తారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసికొనండి. ఉద్యోగులకు బాధ్యతల పెరుగుదల, బదిలీలు ఉండవచ్చును. షేర్లు లాభిస్తాయి. కొత్త ఉద్యోగ ప్రయత్నాలకు అవకాశాలు దొరకవచ్చును. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. కొత్త వ్యాపారాలకు, పరిశ్రమల స్థాపనకు ప్రయత్నాలు చేస్తారు. బ్యాంకు ఋణాలు లభించగలవు.

# కేంద్రాన్ని సెంటిమెంట్‌తో కొట్టిన కేసీఆర్

శ్రీను గల్పిక

అది హైదరాబాద్‌లోని తెలంగాణ సిఎం కేసీఆర్ నివాసం. పక్కరోజు ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లన్నీ చూసుకుని కేసీఆర్ అప్పుడే ఇంటికి చేరుకున్నాడు. అప్పుడే కేటీఆర్, కవిత, హరీష్‌రావులు కూడా చేతుల్లో పారలు, గడ్డపారలు పట్టుకుని వచ్చారు. అందరికీ చెమటలు పట్టేసి ఉన్నాయి. కేసీఆర్‌తో కేటీఆర్ వుండి... ప్రధాని పర్యటన ఏర్పాట్లన్నీ దగ్గరుండి మేమే చూసుకున్నాం డాడీ, అన్ని పనులు స్వయంగా మేమే చేసామని చెప్పాడు. కేసీఆర్ వారిని అభినందించి... పోయి భోంచేసి పడుకోండి. రేపు ఎర్లీగా లేయాలి కదా అని చెప్పి పంపించి, తాను మాత్రం టీవీ ఆన్ చేసి భక్తి ఛానెల్ పెట్టాడు. అందులో శివుడికి సంబంధించి సినిమా వస్తోంది. కేసీఆర్ పూర్తిగా చూడసాగాడు.

కైలాసంలో శివపార్వతులు అప్పుడే 'ఓం నమో రుద్రాయ', 'ఓం నమో నీల కంఠాయ' అనే ఖలేజా సినిమాలోని పాటకు నృత్యం చేసి సేదతీరుతుంటారు. అప్పుడే సుబ్రహ్మణ్యం, బొజ్జ గణపయ్యలు అక్కడకు వస్తారు. శివుడు వారితో... కుమారులారా, మీ ఇద్దరి తెలివితేటలకు నేనొక టెస్ట్ పెట్టదలచాను. మీ ఇద్దరిలో ఎవరైతే ముల్లోకాలను వేగంగా చుట్టి ముందు వస్తారో వారు సమర్థులు, మేధావుల లెక్క... అని చెప్పాడు. సుబ్రహ్మణ్య స్వామి మనసులో... ఈ టెస్ట్‌లో గెలవడం నాకు భలే సులభం. నెమలి వాహనం మీద ముల్లోకాలను ఇట్టే రౌండ్ చుట్టేస్తాను. పాపం మా గణపయ్యే... ఆ ఎలుక మీద ముల్లోకాలు తిరిగి రావాలంటే మూడు యుగాలు పడుతుందని సంతోషిస్తూ... పోటీకి నేను రెడీ అంటూ ముందుకొచ్చాడు. ఇద్దరూ ఒకే లైన్ మీద తమ వాహనాలు ఎక్కి సిద్ధంగా వుండగా శివయ్య ఢమరుకం మోగించి పోటీని ప్రారంభించాడు. సుబ్రహ్మణ్య స్వామి మాత్రం నెమలి మీద షార్ నుండి వదిలిన రాకెట్‌లా దూసుకుపోగా... గణపయ్య అక్కడే కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టాడు. ఆ నెమలితో ఈ ఎలుక ఎక్కడ పరుగెత్తగలదు, అదీగాక ఈమధ్య నెల్లూరు ముదురుదోమలు కరిచి చికెన్‌గున్యా వచ్చి నీరసపడింది. ఇక్కడే లాజిక్‌ను ప్రదర్శించాలి, నా తండ్రి ఎలాగూ బోళామనిషి... బోల్తా కొట్టించేస్తే పోలేదా అనుకుంటూ ఎలుక మీద శివపార్వతుల చుట్టూ మూడు రౌండ్లు కొట్టాడు. అది చూసి శివయ్య... ఏంటి, వినాయక ఇది... ముల్లోకాలు తిరిగి రమ్మంటే మా చుట్టూ తిరుగుతున్నావన్నాడు. దానికి గణపయ్య... మీ చుట్టూ తిరిగితే ముల్లోకాలు తిరిగినట్లే కదా తండ్రి... అని చెప్పాడు. ఆ మాట విని శివయ్య ఉన్నట్లుండి వంద కిలోలు పెరిగాడు. వెంటనే విష్ణుమూర్తిని పిలిచి... నాయనా, వినాయక ఇంతకు ముందు నువ్వు చెప్పింది మళ్ళీ చెప్పు అని అన్నాడు. మీ చుట్టు తిరిగితే ముల్లోకాలు తిరిగినట్లే కదా తండ్రి... అని మళ్ళీ వినాయకుడు చెప్పాడు. ఆ తర్వాత శివయ్య... బ్రహ్మ, దేవేంద్రుడు, అగ్ని, వాయుదేవుడు... ఇత్యాది దేవతలందరినీ పిలిపించుకుని వినాయకుడి చేత అదే మాట చెప్పించసాగాడు. సాయంత్రం దాకా అలా చెప్పి చెప్పి వినాయకుని గొంతు వాచిపోయింది. అందరికీ చెప్పడం అయిపోయాక వినాయకుడిని గుండెలకు హత్తుకుని అతనినే విజేతగా ప్రకటించాడు శివయ్య. టీవీలో ఈ సన్నివేశాలన్నీ కేసీఆర్ మైండ్‌లో బలంగా నాటుకుపోయాయి.

★★★★★

ఢిల్లీలోని ప్రధాని కార్యాలయం. నరేంద్ర మోడీ టీవీ ఆన్ చేసి 'ఈ టీవీ' పెట్టాడు. హైటెక్ రత్న, ఏపి సిఎం చంద్రబాబు ప్రెస్‌మీట్... రాష్ట్రానికి ప్రత్యేక హోదా సంజీవని కాదు, అదొచ్చినా ఒకటే రాకపోయినా ఒకటే... కాని సింగపూర్ లాంటి రాజధానిని కట్టాలంటే కనీసం లక్ష కోట్లన్నా ఉండాలి. అలాగే రాష్ట్రంలో ఎయిర్‌పోర్ట్‌లు, హైటెక్ సిటీలు, పుష్కరాలు వంటివి ఘనంగా జరుపుకోవాలంటే మరో రెండు లక్షల కోట్లన్నా కావాలి. నరేంద్ర మోడీని కలిసి ఇదే అడగబోతున్నాను అని చెప్పాడు. అది చూసి మోడీ పక్కనున్న వెంకయ్యనాయుడుతో... ఇతని నోటికి లక్ష కోట్లు... రెండు లక్షల కోట్లు అన్న మాటలు తప్పితే ఇంకేమీ రావా... ఎప్పుడూ డబ్బు యావేనా... ఈయనను సింగపూర్ రాజధాని ఎవరు కట్టమన్నారు... డబ్బుల్లేనప్పుడు మన స్థాయికి తగ్గ రాజధాని కట్టుకుంటే సరిపోతుంది కదా... అని కసురుకున్నాడు. వెంకయ్య ఏమీ అనలేక మౌనం వహించాడు.

★★★★★

హైదరాబాద్ పర్యటనకు వచ్చిన మోడీ జద్చర్లలో మిషన్ భగీరథ ప్రారంభించాడు. ఆ తర్వాత హైదరాబాద్ వచ్చి ఎల్‌బి స్టేడియంలో బీజేపీ కార్యకర్తల సభలో పాల్గొన్నాడు. తిరిగి ఢిల్లీ వెళ్లడం కోసం బేగంపేట ఎయిర్‌పోర్టుకు బయలుదేరాడు. అప్పటికే మోడీకి వీడ్కోలు పలకడం కోసం చంద్రబాబు, కేసీఆర్‌లు అక్కడకు చేరుకున్నారు. కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా పలుకరించిన చంద్రబాబు... తెలంగాణ అభివృద్ధి కోసం ప్రధానిని నిధులేమన్నా అడిగారా? అని ప్రశ్నించాడు. అప్పుడే కేసీఆర్ మనసులో... నేనేమీ అడగలేదంటే ఇతను కూడా అడక్కుండా ఉంటాడు... నాతో పాటూ ఇతనికీ మోడీ వద్ద మార్కులు పడతాయి, అలాకాకుండా ఇతనిని మోడీ వద్ద బ్యాడ్ చేయాలి అని మనసులో అనుకుని... తెలంగాణ అభివృద్ధికి నేను రెండు లక్షల కోట్లు అడగాలనుకుంటున్నాను అని చెప్పాడు. అప్పుడు చంద్రబాబు మనసులో... ఇతనే రెండు లక్షల కోట్లు అడిగితే, ఇక సింగపూర్ రాజధాని నిర్మాణం పెట్టుకున్న నేను నాలుగు లక్షల కోట్లు అడగడంలో తప్పు లేదనుకున్నాడు. అంతలో మోడీ అక్కడకు చేరుకున్నాడు. చంద్రబాబు నేరుగా ఆయన వద్దకెళ్లి... సార్, సింగపూర్ రాజధాని కట్టుకుంటున్నాం, మీ వంతు సాయం చేయాలన్నాడు. దానికి మోడీ... భూమి పూజప్పుడే నావంతు సాయంగా పార్లమెంట్ మట్టి, యమునా నీళ్లు తెచ్చానుకదా అని అడిగాడు. అందుకు చంద్రబాబు... మట్టి, నీళ్లు కావాలంటే నేనే మీకు ఎంతైనా ఇస్తాను, మా సింగపూర్ రాజధానికి కనీసం నాలుగు లక్షల కోట్లన్నా ఇవ్వండన్నాడు. ఆ లక్షల కోట్లు మాట వినగానే మోడీ ముఖం చిట్లించినట్లు పెట్టి... మనసులో ఈ చంద్రబాబు డబ్బులు చెట్లకు కాస్తున్నాయనుకుంటున్నాడు, నోరు విప్పితే లక్షల కోట్లంటాడు, ప్రేమగా, అభిమానంగా మాట్లాడేదే తెలియదు అనుకుని... సరే చూద్దాంలే అని కేసీఆర్ వైపు తిరిగి నీకు ఎన్ని లక్షలకోట్లు కావాలని ప్రశ్నించాడు. చంద్రబాబు నాలుగు లక్షల కోట్లు అడగ్గానే మోడీ ముఖంలో మార్పులు గమనించిన కేసీఆర్, జాగ్రత్త పడ్డాడు. మాకు వేలు, లక్షల కోట్లు అవసరం లేద్సార్... అంతకంటే విలువైన మీ ప్రేమ, అభిమానం మా రాష్ట్రం మీద ఉంటే చాలు... అంతకంటే విలువైనదేముంది అని సెంటిమెంట్ డైలాగ్ వదిలాడు. అంతే... మోడీ ఠక్కున కేసీఆర్‌ను కౌగలించుకుని... నీ రాష్ట్రానికి ఏమేం కావాలో ప్రతిపాదనలు పంపు... వెంటనే నిధులు మంజూరు చేస్తా... ఎన్ని లక్షల కోట్లయినా ఫర్వాలేదు అని టాటా చెప్పి విమానమెక్కాడు. ఔరా... కేసీఆర్, నాతో పాటు మోడీని కూడా భలే బోల్తా కొట్టించాడే... అని అనుకుంటూ చంద్రబాబు తనలో తానే కుమిలిపోసాగాడు.

# విజయా డెయిరీకి 4లక్షల ఆదాయం



సమావేశంలో ప్రసంగిస్తున్న డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి

ఈ ఏడాది మే నెలలో పాల విక్రయాల ద్వారా సంస్థకు రూ. 4లక్షల ఆదాయం లభించిందని విజయా డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం నెల్లూరు వెంకటేశ్వరపురంలోని నెల్లూరుజిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సమితి (విజయా డెయిరీ) ప్రధాన కార్యాలయంలో డెయిరీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మెన్ మాట్లాడుతూ నెల్లూరుజిల్లా కావలి పాల శీతలీకరణ కేంద్రం భవనం శిథిలావస్థకు చేరినందున నూతన భవనం నిర్మించాలని, పాలసేకరణ లక్ష్యం పెంచాలని పాలకవర్గ సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. సహకార చట్టం ప్రకారం ప్రతి ఏటా సెప్టెంబర్ 30వ తేదీతో ముగ్గురు పాలకవర్గ సభ్యుల పదవీకాలం ముగుస్తుందని, ఆయా స్థానాలకు సెప్టెంబర్ 21న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారిగా నంద్యాల వరదారెడ్డి వ్యవహరిస్తారన్నారు. సెప్టెంబర్ 30న డెయిరీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో విజయ డెయిరీ ఎండి కృష్ణమోహన్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ఈ నెల 8వ తేదీన నెల్లూరు టౌన్‌హాల్లో సింహపురి మ్యాజిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సింహపురి ఇంద్రజాల మహోత్సవాలలో త్రిడి క్విలింగ్ పేపర్ డాల్స్ కళాకండాలను తయారు చేసి, ఒకే నెలలో ఆరు రికార్డులు సాధించి 'కళావిశారద' బిరుదు పొందిన శ్రీమతి పోబోలు శారదను సత్కరిస్తున్న ఆర్యవైశ్య మహిళలు.

# నో పార్కింగ్.. రూల్స్..!

నెల్లూరిది... మీరు 'నో పార్కింగ్' బోర్డులు పెడితే మేం దానిని ఫాలో అవ్వాలా...? మా ఊరు... మా ఆటో... మా ఇష్టం. రూల్స్ గీల్స్ ఇక్కడ జాన్తానై... మేం రోడ్ల మీదే ఆటోలు నిలుపుతాం... మీరు 'నో పార్కింగ్' బోర్డులు పెట్టిన ప్రాంతాలే మాకు పార్కింగ్ జోన్లు. పోలీసులారా... ఈ బోర్డులను తీసుకెళ్లి మీ పోలీసు స్టేషన్‌లలో పెట్టుకోండి... నెల్లూరు మా అడ్డా... ట్రాఫిక్ రద్దీతో ఎవరు ఎక్కడ చస్తే మాకేం... ఇది మా రాజ్యం... మేం చెప్పిందే చట్టం... ఇదే ప్రజాస్వామ్యం!




# ట్రాఫిక్‌ను సరిదిద్దండి



నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉత్పన్నమవుతున్న ట్రాఫిక్ సమస్యను మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ జడ్.శివప్రసాద్‌లు సోమవారం పరిశీలించారు. ఆత్మకూరు బస్టాండ్‌లోకి వెళ్లే వాహనాలు మహాత్మా జ్యోతిరావు పూలే బొమ్మ వద్ద నుండి మలుపు తిరిగి రావాల్సి వస్తుంది. దీనివల్ల ఈ సర్కిల్‌లో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ సమస్య తమ దృష్టికి రావడంతో ముంగమూరు, జడ్.యస్.లు అక్కడికెళ్లి పరిశీలించారు. ఆత్మకూరు బస్టాండు ఫ్లై ఓవర్ క్రింద డివైడర్‌ను తొలగిస్తే కొంత ట్రాఫిక్‌ను ఇక్కడే దారి మళ్లించవచ్చునని వారు తెలిపారు. అలాగే ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడి అప్రోచ్‌రోడ్డును బాగు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కెటి శేషయ్య, బుజ్జయ్య, రాజా, వీరయ్య, వెంకటేశ్వర్లు, కిషోర్, రవి తదితరులు పాల్గొన్నారు.

# జేసీకి జాతీయ సమైక్యతా అవార్డ్



జిల్లా జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ అహ్మద్‌కు జాతీయ సమైక్యతా అవార్డు లభించింది. మాజీరాష్ట్రపతి స్వర్గీయ ఏపిజె అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌కు చెందిన మీడియా కౌన్సిల్ వివిధ రంగాలలో చేసిన విశిష్ట సేవలకుగాను ఆయనకు ఈ అవార్డును అందజేసింది. మీడియా కౌన్సిల్ జాతీయ అధ్యక్షులు ఇస్మాయిల్ ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు.



## కావలి కబుర్లు

# అణువిద్యుత్ కేంద్రాన్ని అడ్డుకుంటాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అణువిద్యుత్ కేంద్రాలను ప్రపంచ దేశాలు ఓ వైపు వ్యతిరేకిస్తుంటే చంద్రబాబునాయుడు మాత్రం కావలి ప్రాంతంలో ఏర్పాటు చేయాలనుకోవడం బాధాకరమని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి అన్నారు. ఈ నెల 6వ తేదీ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కావలి నియోజకవర్గ ప్రజల జీవితాలతో చెలగాటమాడే అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ప్రకటన చేస్తే కావలి తెలుగుదేశం పార్టీ నాయకులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటు విరమించుకోకపోతే కావలి ప్రజల కోసం ఆమరణ నిరాహారదీక్ష చేయడానికైనా సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.వెంకటనారాయణ, జగదీశ్వరరెడ్డి, కుందుర్తి కామయ్య, ప్రసన్నాంజనేయులు, జంపాని రాఘవులు, మహేంద్రయాదవ్, పేరం వెంకటేశ్వర్లు, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక హోదాపై మాటతప్పిన బీజేపీ




రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న సీపీఐ, సీపీఎమ్ నాయకులు

ప్రత్యేకహోదాపై బీజేపీ మాట తప్పిందని, అందుకు తగిన మూల్యం చెల్లించాల్సివస్తుందని సీపీఐ కావలి నియోజకవర్గ కార్యదర్శి డేగా సత్యన్నారాయణ అన్నారు. ఇటీవల రాష్ట్రకమిటీ పిలుపు మేరకు స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోదా భిక్ష కాదని.. హక్కు అని... నినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తించారు. ఈ సందర్భంగా డేగా సత్యన్నారాయణ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని రెండుగా విడగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంటు సాక్షిగా అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ 5సంవత్సరాల ప్రత్యేకహోదా ఇస్తున్నట్లు ప్రకటించారు. ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ పార్టీ నాయకుడైన వెంకయ్యనాయుడు బీజేపీ అధికారంలోకి వస్తే 10సంవత్సరాలు ప్రత్యేకహోదా కొనసాగిస్తామని పార్లమెంటు సాక్షిగా మాట్లాడి.. నేడు అధికారంలోకి రాగానే ప్రత్యేకహోదా పక్కన పెట్టి ప్రత్యేక ప్యాకేజీ అంచెలువారీగా ఇస్తానని చెప్పడం బాధాకరమన్నారు. గత ఎన్నికలలో ప్రత్యేకహోదాతో కలిపి అనేక హామీలు ఇచ్చిన బీజేపీ, తెలుగుదేశం ప్రభుత్వాలు ఆంధ్ర ప్రజలను నట్టేట ముంచాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వచ్చేవరకు వామపక్షాల ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం చేస్తామన్నారు. అఖిల పక్షం వేసి అన్ని పార్టీలను ప్రధానమంత్రి వద్దకు తీసుకెళితే తప్పనిసరిగా ప్రత్యేకహోదా వస్తుందని ఆయన హితవు పలికారు. సీపీఎం కావలి డివిజన్ కార్యదర్శి తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ.. గత కాంగ్రెస్ ప్రభుత్వం తెలుగుజాతికి అన్యాయం చేసి ఏ విధంగా తుడిచిపెట్టుకుపోయిందో అదే విధంగా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు రానున్న ఎన్నికలలో బీజేపీ, టీడీపీలు తుడిచిపెట్టుకుపోతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎం.బాలకోటయ్య, బలిజేపల్లి వెంకటేశ్వర్లు, ప్రకాష్, వాయుల పార్వతమ్మ, పి.మహేష్, కంభాల భిక్షాలు, సీపీఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, సిఐటియు నాయకులు షేక్ ఆబిద్, చేవూరు వరప్రసాద్, సురేష్, సుబ్రహ్మణ్యం, నారాయణ, గుడ్‌మెన్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ సోమిశెట్టి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.




# అవయవదానం చేయండి-పునర్జన్మను ఇవ్వండి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పట్టణ ప్రముఖులు

అవయవదానం చేసి పునర్జన్మనివ్వాలని డా॥ మాధవరెడ్డి అన్నారు. ఈ నెల 6వ తేదీ ప్రపంచ అవయవదానం దినోత్సవ సందర్భంగా కావలి పట్టణంలోని అభయం స్వచ్ఛంద సేవాసంస్థ కార్యాలయం నుండి ఆర్‌డీఓ ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ.. అవయవదానంపై ప్రజల్లో చైతన్యం రావాలన్నారు. మరణించిన పిదప మన దేహాన్ని మట్టిలోనూ లేదా బూడిదపాలు చేసేబదులు నేత్రదానం ద్వారా అంధులకు చూపు, శరీరదానంతో వైద్యవిద్యార్థులకు జ్ఞాన సముపార్జన వస్తుందన్నారు. ఎవరైనా ఉత్సాహవంతులు మరణాంతరం అవయవదానం చేసే వాగ్దాన పత్రాలను ఇచ్చేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో డా॥క్రిష్ణారెడ్డి, సేవాసంస్థ అధ్యక్షుడు ఇలీంద్ర వెంకటేశ్వర్లు, శ్రీసాయి విద్యానికేతన్ విద్యార్థులు, రెడ్‌క్రాస్ లైవ్‌బ్లడ్ వరల్డ్ సంస్థ నిర్వహకులు పాల్గొన్నారు.

## యూనివర్శల్ రికార్డ్స్ ఫోరమ్‌లో మునవ్వీర్



యూనివర్శల్ రికార్డ్స్ ఫోరమ్ నుండి సర్టిఫికేట్ – 2016 నేషనల్ రికార్డును నెల్లూరు జెండావీధికి చెందిన సూక్ష్మ స్వర్ణ కారుడు డా॥ షేక్ మునవ్వీర్ బుధవారం అందుకున్నారు. వెండి, బంగారంతో జాతీయ గీతం, మహాత్మాగాంధీ, గణేష్, జాతీయ పతాకం, క్రిస్మస్ ట్రీ తదితర సూక్ష్మ నమూనాలను తయారు చేసినందుకుగాను యూనివర్శల్ రికార్డ్ ఫోరమ్ వైస్‌ప్రెసిడెంట్ సువోదీప్ చటర్జీ, యూఆర్ఎఫ్ హెడ్‌జ్యూరీ సునీల్ జోసెఫ్, యుఆర్ఎఫ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డా॥ సిద్ధార్థ ఘోష్‌లు ఈ సర్టిఫికేట్‌ను జారీ చేశారు.

## పుష్కలంగా అవినీతి!

(మొదటి పేజీ తరువాయి)

ఎంత ఖాళీగా ఉంటున్నాడో అర్థమైపోతోంది. గోదావరి పుష్కరాలని చెప్పి 2వేల కోట్లు విడుదల చేశారు. తూతూ మంత్రంగా పనులు చేశారు. చేసిన పనులన్నీ కూడా తాత్కాలికమే! అవి కూడా నాణ్యతగా లేవు. ఇక మళ్ళీ పుష్కరాలొచ్చేది 12ఏళ్లకు. అప్పటికి ఈ చేసిన పనులేవీ ఉండవు. మళ్ళీ నిధులు... మళ్ళీ పనులు. ఈ రెండువేల కోట్లు గోదావరి నీళ్లలో చల్లినట్లే!

గోదావరి పుష్కరాల ఖర్చుపై విపరీతంగా విమర్శలు రావడం వల్లనేమోగాని... కృష్ణ పుష్కరాల ఖర్చును బయటకు పొక్కనీయడం లేదు. అయితే ఇక్కడా హంగూ ఆర్భాటం ఏ మాత్రం తగ్గడం లేదు. ముఖ్యంగా కృష్ణా నది పుష్కరాలు అప్పటికప్పుడు నిర్ణయించినవి కావు. ఏపి సంవత్సరాలలో కృష్ణానది పుష్కరాలు వస్తాయన్నది వ్రాసి పెట్టబుంటుంది. కాబట్టి పుష్కరాలకు సంబంధించిన పనులను ఏడాది కాలం నుండే తీరిగ్గా, నాణ్యంగా చేసి ఉండొచ్చు. కాని, ఇలా చేస్తే చంద్రబాబుకు 'కిక్' ఉండదేమో? కృష్ణ పుష్కరాల పనులను చాలా తక్కువ సమయంలో యుద్ధప్రాతిపదికన మొదలు పెట్టించాడు. ఈ పనులకు సంబంధించిన కాంట్రాక్ట్లన్నీ కూడా తెలుగు తమ్ముళ్లకే దక్కాయి. ఎక్కువ పనులను నామినేషన్‌ల పద్ధతిలోనే కేటాయించారు. కేవలం నాలుగు రూపాయలు సంపాదించుకోవాలని చెప్పి చేసిన పనులే ఇవి. ఇక ఆ పనులు ఎంత అధ్వాన్నంగా అఘోరిస్తాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పుష్కరాలు మొదలు కాకముందే పుష్కర ఘాట్లలో పగుళ్లు... వేసిన టైల్స్ లేచిపోవడం... వేసిన రోడ్లలో పగుళ్ళు... భక్తి శ్రద్ధలతో నిర్వహించాల్సిన ఓ సంప్రదాయ వేడుకను ప్రభుత్వం అవినీతికి వేదికగా మలచడమే జుగుప్స కలిగిస్తోంది. అసలు పుష్కరాల పేరుతో ఈ ప్రచారం, ఇంత హంగామా, ఇంత దోపిడీ అవసరమా? ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నట్లు ఇవేమీ చంద్రబాబు ఇంట్లో జరిగే వేడుకలు కావు... ఈయన వెళ్లి ప్రధానిని, కేంద్రమంత్రులను పుష్కరాలకు ఆహ్వానించడానికి! అలాగని ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే జరుగుతున్నవి కావు... కృష్ణ పుష్కరాలే కర్నాటక, తెలంగాణలలోనూ జరుగుతాయి. దేశంలో మొత్తం 12 నదులు ప్రవహించే రాష్ట్రాలలో ప్రతి ఏటా కుంభమేళా అనో, పుష్కరాలనో ఈ వేడుకలు జరుపుతుంటారు. ఆ రాష్ట్రాల సీఎం లెవరూ పుష్కరాలకు ఇంత హంగామా చేయడం లేదు. పుష్కరాల పేరుతో విచ్చలవిడి అవినీతికి తెరతీయడం లేదు. అంతెందుకు మనపైన ఉన్న తెలంగాణనే చూద్దాం... అక్కడా మొన్న గోదావరి పుష్కరాలు జరిగాయి. ఎంత పద్ధతిగా జరిపారు. మనలాగా అక్కడ రెండు వేల కోట్లు ఖర్చుపెట్టలేదు. కాని గోదావరి పుష్కరాలను పవిత్రంగా జరిపారు. ఎక్కడా అవినీతి ఆరోపణలు లేవు. ఇప్పుడు కృష్ణ పుష్కరాలలోనూ వాళ్లు ఎలాంటి హంగామా చేయలేదు. అలాగని పుష్కరాల ఏర్పాట్లను పద్ధతిగా చేశారు. కాని చంద్రబాబు పుష్కరాలు మొదలు కాకముందే విజయవాడలో గుళ్లు, గోపురాలను, నాయకుల విగ్రహాలను కూలదోయించి... పుష్కరాల పవిత్రతకు ఉన్న అర్థాన్నే మార్చేశాడు.

## గబ్బులోనూ నెం.1

(మొదటి పేజీ తరువాయి)

అయితే ఈ నెంబర్ వన్ ర్యాంకు మంత్రిగా ఆయన పనితీరు ద్వారానో, విద్యాసంస్థల అధినేతగా ఆయన చేసిన విద్యాభివృద్ధి కృషితోనో వచ్చింది కాదు... ఏపి క్యాబినెట్‌లోని సంపన్న మంత్రుల్లో ఆయనే నెంబర్ వన్. రికార్డుల ప్రకారం అధికారికంగా ప్రకటించిన ఆస్తులు 496కోట్లు. ఇక అనధికారికంగా, బినామీల పేరు మీద ఎన్ని ఆస్తులున్నాయో అంచనా వేయడం కష్టమే! ఆ లెక్కల్లోకి పోతే దేశంలోనే టాప్ టెన్‌లో ఉండొచ్చు.

అయితే డబ్బులోనే కాదు, జిల్లాలో తెలుగుదేశం పార్టీని గబ్బు పట్టించడంలోనూ, తాను గబ్బు పట్టడంలోనూ ఆయన నెంబర్ వన్‌గానే నిలిచాడు. మంత్రిగా ఆయన పనితీరు ఎంత అధ్వాన్నంగా ఉందన్నది ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన ర్యాంకులను బట్టే అర్థం చేసుకోవచ్చు. మంత్రిగా ఆయన పనితీరుకు చివరి ర్యాంకు రావడం తెలిసిందే! తనకు చివరి ర్యాంకు ఇచ్చినందుకు ఆయన చంద్రబాబు మీద కొంతకాలం అలిగాడు కూడా!

ఇక నెల్లూరు జిల్లా ప్రజలు తమ చరిత్రలో ఇలాంటి మంత్రిని ఎప్పుడూ చూసి వుండరు. బెజవాడ గోపాలరెడ్డిని మొదలుకొని ఏ.సి.సుబ్బారెడ్డి, నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డిల నుండి పసల పెంచలయ్య, పరసారత్నం వంటి దళిత మంత్రులతో పాటు సోమిరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి వంటి వారిని మంత్రులుగా చూసారు జిల్లా ప్రజలు. వారందరు కూడా ప్రజలకు అందుబాటులో వుంటూ తమ చేతనైనంత వరకు జిల్లా అభివృద్ధికి పాటుపడ్డారు. వాళ్లను చూసిన కళ్లతో ఇప్పుడు నారాయణను మంత్రిగా చూడాలంటే... ఎవరికీ కూడా ఆయన మంత్రిగా మనసుల్లోకి ఎక్కడం లేదు. ఎప్పుడన్నా ప్రజల్లోకి వస్తే కదా, జనం సమస్యలు వింటే కదా? కేవలం చంద్రబాబు ఏజెంట్‌గా, రాజధాని భూముల డెవలపర్‌గా మాత్రమే ఆయన పని చేస్తున్నాడు. రాజధాని పేరుతో జరుగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మూల స్థంభంగా ఉంటూ అటు డబ్బులోనూ ఇటు గబ్బు పట్టడంలోనూ నెంబర్‌వన్ ర్యాంకును పదిల పరుచుకుంటూ జిల్లా ప్రజల మనసుల్లో మాత్రం చివరి స్థానానికి పరిమితమయ్యాడు.

## గీతామయికి స్నేహిత్ శీతల శవపేటిక




ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీ నెల్లూరు బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమానికి స్నేహిత్ ఫౌండేషన్ వారు శీతల శవపేటికను వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నెల్లూరు నగర డిప్యూటీమేయర్ ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ గీతామయి చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి స్నేహిత్ ఫౌండేషన్ వారు, వారికి శీతల శవ పేటికను అందజేయడం అభినందించదగ్గ విషయమన్నారు. గీతామయి వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు తమ్మినేని పొందు మాట్లాడుతూ పేద ప్రజలకు శీతల శవపేటికను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్నేహిత్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుర్రం వెంకటేశ్వర్రావు, 5వ డివిజన్ కార్పొరేటర్ రవి, ఫౌండేషన్ సభ్యులు, మావిళ్ల వెంకటసురేష్, అయితా సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సారా రక్కసినెదిరించిన ధీరవనిత..


# దూబగుంట రోశమ్మ.. ఇక లేరు

*సారా మహమ్మారికి వ్యతిరేకంగా మహోద్యమం నడిపిన దూబగుంట రోశమ్మ ఇక లేరు. కిడ్నీ సంబంధిత వ్యాధితో ఆమె ఆదివారం కన్నుమూశారు. స్వస్థలమైన దూబగుంటలో సోమవారం ఆమె భౌతిక కాయానికి అంత్యక్రియలు జరిగాయి. సారా ఉద్యమ కేతనాన్ని జిల్లాలోనే కాక, రాష్ట్రవ్యాప్తంగా రెపరెపలాడించిన ఘనత ఆమెదే. మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏమీ లేదని నిరూపించిన ధీరవనిత రోశమ్మ. ఎందరికో ఉద్యమస్ఫూర్తిని కలిగించి, సారా ఉద్యమాన్ని ముందుకు నడిపించిన ఉద్యమ నేత ఆమె. వయసు మీదపడడం, అనారోగ్యం పాలుకావడంతో ఆమె అశేష ప్రజానీకాన్ని కన్నీటిసంద్రంలో ముంచి ఇక ఏ ఉద్యమాలూ అవసరం లేని దూరానుదూర తీరాలకు తరలిపోయారు..కిడ్నీవ్యాధితో బాధపడుతూ తనువు చాలించారు. ఆమె మృతితో ప్రజలు ఆవేదనతో కంటతడిపెట్టారు. తన ఉద్యమస్ఫూర్తితో ప్రజల గుండెల్లో శాశ్వతస్థానం సంపాదించుకున్న దూబగుంట రోశమ్మ..ఉద్యమాలకు పుట్టినిల్లయిన సింహపురిసీమ చరిత్రలో చిరస్మరణీయంగా..ఒక ప్రత్యేక ఉద్యమ అధ్యాయంగా నిలిచిపోయారు.*



ఆమె పేరు వింటేనే సారాక్షసుల గుండెల్లో రైళ్లు పరుగెత్తేవి. ఆమె వస్తుందంటే చాలు ఎక్కడ సారాయంగళ్ళు అక్కడికక్కడే మూతపడేవి. నిరుపేద కుటుంబాల అమాయకత్వాన్ని, అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని వారి కుటుంబాల్లో చిచ్చుపెడుతున్న సారా మహమ్మారిని తరిమికొట్టాలని, సామాన్యప్రజల సంసారాల్లో ఆనందం వెల్లివిరిసేలా చేయాలని దుడ్డుకర్ర చేత పట్టుకుని కొదమసింగంలా కదిలివచ్చిందామె. ఆమే..దూబగుంట రోశమ్మ. జలదంకి మండలం గట్టుపల్లి చింతలపాలెంలో ఓ పేదరైతు కుటుంబంలో జన్మించి, కలిగిరి మండలం దూబగుంట గ్రామంలో వివాహం చేసుకున్న రోశమ్మ పూర్తి పేరు.. వర్ధినేని రోశమ్మ. ఇంటిపేరు 'వర్ధినేని' అయినా సారావ్యతిరేక మహోద్యమంతో ఆమె పేరు 'దూబగుంట రోశమ్మ'గా మారిపోయింది. 1992 ప్రాంతంలో మద్యం మత్తులో వున్న ఇద్దరు గ్రామస్తులు వయోజన విద్యా కార్యక్రమ సిబ్బందిపై దాడి చేశారన్న విషయం తెలిసి ఆమె అగ్రహోదగ్రురాలు అయింది. పల్లెల్లో ప్రజలు సైతం ఈ సారా తాగుబోతుల దాష్టీకాలతో వేగలేక అసహాయ స్థితిలో నిత్యం తీవ్ర ఆవేదనలకు గురవుతుండడం, తాగుబోతు భర్తలు సంపాదించినదంతా తాగి తగలేస్తుండడం, అప్పుల తిప్పలతో పస్తులతో భార్యాబిడ్డలు అల్లాడిపోతుండడం, అనేక కుటుంబాలు ఈ సారా రక్కసి ధాటికి కన్నీరుమున్నీరుగా విలపిస్తుండడం చూసిన రోశమ్మ.. ఇక సహించలేకపోయింది. ఈ బాధలు ఇంకా ఎన్నాళ్ళంటూ మహిళలందరినీ కూడగట్టింది. తాను నిరక్షరాస్యురాలైనప్పటికీ ఏమాత్రం వెరవక మహిళల్లో చైతన్యం రగిలించింది. ఉద్యమ స్ఫూర్తిని నింపింది. సారా రాయుళ్ళ ఆగడాలను ఎదిరించడానికి ఎంత సాహసానికైనా దిగాలని గట్టిగా నిర్ణయించుకుంది. ఆ ధీరవనిత స్ఫూర్తితో గ్రామాల్లోని మహిళలంతా సారా వ్యతిరేక నినాదాలతో ఘర్జిస్తూ కదలివచ్చారు. అంటే, ఆ నినాదాలే ఉద్యమంగా మారాయి. ఊపెత్తిన ఆ ఉద్యమంతో రోశమ్మ ఒక వ్యక్తిగా కాక సామూహిక శక్తిగా మారిపోయింది. దూబగుంట నుంచి ఆ ఉద్యమం జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టిస్తూ మహోధృతంగా ముందుకు సాగింది. ఎందరో నాయకులు, ప్రజలు ఆ ఉద్యమానికి బాసటగా నిలిచారు. సారా వ్యతిరేక నినాదాలు మిన్నుముట్టాయి. దీంతో జిల్లానుంచి రాష్ట్రానికి ఉద్యమ సెగలు ఎగబాకాయి. జాతీయస్థాయిలోనూ దూబగుంట రోశమ్మ నిర్వహిస్తున్న సారా వ్యతిరేకోద్యమం పెద్ద కలకలాన్నే సృష్టించింది. ఒక మహిళగా, అందులోనూ తాను నిరక్షరాస్యురాలే అయినా ప్రజలను, పెద్దఎత్తున మహిళలను ఉద్యమానికి కదిలించగలిగిన ధీరనారిగా దూబగుంట రోశమ్మ ప్రఖ్యాతి చెందింది. అయితే, ఆమె ఏనాడూ ప్రచారార్భాటాలకోసం, వ్యక్తిగత ప్రతిష్ట కోసం అర్రులు చాచలేదు. సారాపై సమర శంఖం పూరించి, సారా రక్కసిని సమాజాన్నుంచి తరిమికొట్టి సంసారాలను నిలబెట్టాలన్నదే ఆమె ఏకైక లక్ష్యం. మద్యం మత్తునుంచి సమాజాన్ని విముక్తం చేయాలన్నదే ఆమె జీవితాశయం. ఆ ఆశయసాధన కోసం ఆమె చేసిన కృషి అపారం. ఆమె స్ఫూర్తితో మహిళా లోకం సారా రక్కసిపై విరుచుకు పడింది. ఎక్కడ అమ్మకాలు జరిగినా సాహసంతో మహిళలంతా రోడ్లపై నిలచి అడ్డుకున్నారు. అగ్నికణంలా ఎగసిపడిన ఈ ఉద్యమ ఫలితంగా 1993 అక్టోబర్ 1 నుంచి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి సారాపై నిషేధం విధించడంతో ఉద్యమకారుల్లో ఆనందం వెల్లువెత్తింది. నాటుసారాతో పాటు మద్యాన్ని కూడా నిషేధించాలంటూ ఉద్యమం మళ్ళీ కొనసాగింది. 1994 ఎన్నికల్లో మహానేత ఎన్టీరామారావు సైతం ఈ ఉద్యమానికి బాసటగా నిలిచారు. ఎన్నికల సమయంలోనూ మద్యంపై నిషేధం విధించాలంటూ ఆయన గళమెత్తారు. ఎన్నికల్లో నిలిచి గెలిచిన ఎన్టీఆర్, అధికారం చేపట్టగాక సంపూర్ణ మద్యనిషేధంపై తొలి సంతకం చేశారు. ఎన్టీరామారావు చేత 'శెభాష్'.. సింహపురి మహిళా'గా సగర్వంగా పిలిపించుకుని ఆయన చేతులమీదుగా ఘనమైన సత్కారాన్నే అందుకున్నారామె. ఇంతటి మహోన్నత ఉద్యమం వెనుక కష్టాలెన్నో ఎదురైనా ఏనాడూ రోశమ్మ వెనుకంజ వేయలేదు. ఈ విజయప్రస్థానం వెనుక రోశమ్మతో పాటు ఎందరో మహిళలు, ఎంతోమంది నాయకుల, మరెందరో ఉద్యమాభిమానుల విశేషమైన కృషి కూడా వుంది. అంతకు మించి ప్రజల అండదండలూ లభించాయి. దీంతో ఉద్యమానికి విజయం లభించింది. అయితే, ఆ తర్వాత కాలంలో.. అంటే 1996 ప్రాంతంలో మద్యనిషేధం ఎత్తివేయడంతో ఆమె ఎంతో కుమిలిపోయారు. ఆ బాధతో పాటు వయసుమీరడం, వృద్ధురాలు కావడం, ఆర్థికబాధలతో.. అనారోగ్యంతో.. కిడ్నీలు పాడైపోయి ఆసుపత్రి పాలు కావడం ఎంతో బాధాకరం. చివరిదశలో కనీసం పలుకరించేవారు, ఆదరించేవారు లేకనే.. ఆమె శాశ్వతంగా వెళ్లిపోయారు. ఇక ఏ గొడవలూ..ఏ ఉద్యమాలూ అవసరం లేని అనంతలోకాలకు తరలివెళ్ళిపోయారు. ఆ ధీరవనితకు..వీర నారికి..సింహపురి మహిళా కిశోరానికి ఘనంగా నివాళులర్పిస్తూ..ఆమె కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతినీ..సంతాపాన్ని తెలియజేస్తోంది.. 'లాయర్'!..

# పంథా మార్చిన జగన్



ప్రజా జీవితంలో ఉండే నాయకులకు కులంతో, మతంతో సంబంధం లేదు. ఏ కులమైనా అతనిదే! ఏ మతమైనా అతని సమ్మతమే! ప్రతిఒక్కరి విశ్వాసాలను గౌరవిస్తూ, ఆచరిస్తూ ముందుకు సాగేవారే ప్రజాజీవితంలో ముందడుగు వేయగలరు.

ఈ దేశంలో కాశ్మీర్, పాతబస్తీ వంటి చోట్ల తప్పితే ఒక మతం వాళ్లు మాత్రమే ఓట్లు వేసి గెలిచే పరిస్థితి ఎక్కడా లేదు. అన్ని మతాలను, అన్ని కులాలను ఆదరించాల్సిందే! ఒక నాయకుడి మీద లేదా ఒక పార్టీ మీద కులం లేదా మతం ముద్ర పడిందంటే దాని ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది.

2014 ఎన్నికల్లో ఇలాంటి ప్రభావమే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ మీద పడింది. ఆ ఎన్నికల్లో వైకాపా ఖచ్చితంగా అధికారంలోకి వచ్చి వుండాలి. కాని రాలేకపోయింది. దీనికి ప్రధాన కారణాలుగా చంద్రబాబు ఇచ్చిన రుణమాఫీ హామీ, కాంగ్రెస్ కేడర్‌ను జగన్ వద్దనడం, నరేంద్ర మోడీ, పవన్ కళ్యాణ్‌ల ప్రభావం అని చెప్పుకోవచ్చు. ఇవి కాకుండా మరో ప్రధాన కారణం కూడా ఉంది. అదే వైకాపాపై క్రిస్టియానిటీ ముద్ర.

దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి రాజకీయాలలో వున్నంతకాలం ఆయన మతమేంటన్నది చాలామందికి తెలియదు. ఎందుకంటే ఆయన చర్చిలతో పాటు గుళ్లకు, మసీదులకు కూడా అంతే భక్తిగా వెళ్లేవాడు. హోమాలు, యాగాలలో పాల్గొనేవాడు. ఆయన సీఎంగా ఉన్నప్పుడే దేవాలయాలలో పూజారులకు జీతాలు అమలులోకి తెచ్చారు. గుళ్లలో ధూపదీప నైవేద్యాలకు నిధులు విడుదల చేశారు. ఆయన పంచెకట్టు, ఆయన వ్యవహారశైలి అచ్చు తెలుగుదనానికి ప్రతి రూపంగా ఉండేది. ఆయన మరణించాక ఆయనను సమాధి చేసిన పద్ధతిని బట్టి ఆయన క్రైస్తవుడన్న విషయం చాలామందికి తెలిసింది.

కాని మొన్న ఎన్నికలప్పుడు ఈ మతపరమైన అంశాలు జగన్‌పై ప్రతికూల ప్రభావాన్నే చూపాయని చెప్పొచ్చు. లోటస్‌పాండ్‌లోని జగన్ నివాసంపై వున్న క్రైస్తవ మత చిహ్నం శిలువ పచ్చమీడియా పదేపదే లోకానికి చూపింది. ఇక విజయమ్మ బైబిల్ చేతపట్టి ప్రజల్లోకి పోవడం, వై.యస్.షర్మిల, ఆమె భర్త అనిల్‌కుమార్‌లు విస్తృతంగా క్రైస్తవ మత ప్రచార సభలలో పాల్గొంటుండడం కూడా హిందువులలోని కొన్ని వర్గాల్లో వ్యతిరేకత పెంచింది. ఎప్పుడూ కాంగ్రెస్, తెలుగుదేశంల వైపు చెరిసమానంగా ఉండే బ్రాహ్మణులు, వైశ్యులు మొన్న ఎన్నికల్లో మాత్రం దీనిమూలంగా పూర్తిగా తెలుగుదేశంవైపే మొగ్గారు. విశాఖపట్నం లోక్‌సభలో విజయమ్మ ఓడిపోవడానికి కూడా ఇదో కారణంగా భావిస్తారు.

ప్రజా నాయకులు తమ మతాన్ని, తమ కులాన్ని ఇంటి నాలుగు గోడలకే పరిమితం చేసుకోవాలి. రోడ్డు మీదకొచ్చాక అందరూ తనవాళ్లేననుకోవాలి. ముఖ్యంగా ప్రజలు అభిమానించే నాయకుడు ఒక మత సంస్కృతికి ప్రాధాన్యతనిస్తుంటే మిగతా వాళ్లు జీర్ణించుకోలేరు. నేను హిందువునని చెప్పి చంద్రబాబునాయుడు ఎన్నికల సభల్లోకి భగవద్గీత పట్టుకుని వెలితే ముస్లింలు, క్రైస్తవులు ఓట్లు వేస్తారా?

తన మీదున్న మతపరమైన ముద్రను సైతం తొలగించుకోవడానికి జగన్ పూనుకున్నాడు. హిందూ సంప్రదాయాలను నిష్టగా ఆచరిస్తున్నాడు. గత ఏడాది గోదావరి పుష్కరాలలో ఎంతో శాస్త్రోక్తంగా పూజలు జరిపించిన ఆయన, ఆ తర్వాత తన పర్యటనలలో తరచూ దేవాలయాలను, మసీదులను సందర్శిస్తూనే వున్నాడు. అన్ని మతాల వారికి కూడా చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నాడు. తాజాగా రిషికేష్‌లో జరిగిన యాగంలో పాల్గొనడం, గంగలో మునిగి నిష్టగా పూజలు జరపడం, స్వరూపానంద స్వామి ఆశీస్సులు అందుకోవడం... హిందువులలో ఆయన పట్ల వున్న మతపరమైన వ్యతిరేకతను తొలగించేవే! ఈ రాష్ట్రంలో మెజార్టీ ప్రజలైన హిందువులతో పాటు మైనార్టీలను కూడా సమంగా ఆదరించి, వారి సెంటిమెంట్లను సమానంగా గౌరవించిన వారే రాజకీయాల్లో రాణించగలరు. జగన్ ఇప్పుడు కరెక్ట్ ట్రాక్‌లో వస్తున్నాడనిపిస్తోంది.

# జిల్లాలో శాసనమండలి కమిటి



శాసనమండలి కమిటీకి స్వాగతం పలుకుతున్న పోర్టు సిఇఓ అనిల్

ఈ నెల 10న ఆంధ్ర ప్రదేశ్ శాసనమండలి హామీల కమిటీ జిల్లాలో పర్యటించింది. కమిటీ ఛైర్మన్ గాలి ముద్దు కృష్ణమ నాయుడు, ఎమ్మెల్సీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, చంద్రశేఖర్‌రావులు సభ్యులుగా ఈ పర్యటనలో పాల్గొన్నారు. కృష్ణపట్నం పోర్టును సందర్శించిన కమిటీ అక్కడ మౌలిక వసతులను పరిశీలించింది. పోర్టు పరిధిలో కమిటీ సభ్యులు మొక్కలు నాటారు. పోర్టు సిఇఓ ఎండ్లూరి అనిల్‌కుమార్ వారికి పోర్టు ప్రగతిని వివరించారు. పారిశ్రామికాభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం సివిఆర్ ఫౌండేషన్ ద్వారా మొక్కలు నాటడాన్ని కమిటి అభినందించింది. అలాగే నెల్లూరుజిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కమిటీ వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించింది.




# కియా... ఏ ప్రాంతంపై దయ?

## శ్రీసిటీ వైపే మొగ్గు?

అన్నీ అనుకూలిస్తే... రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపిస్తే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఓ కార్ల పరిశ్రమ నెల్లూరుజిల్లాలో ఏర్పాటయ్యే అవకాశముంది. దక్షిణకొరియాకు చెందిన అంతర్జాతీయ కార్ల కంపెనీ హ్యూండాయ్‌కి అనుబంధ సంస్థ అయిన 'కియా మోటార్స్' మన దేశంలో తమ కార్ల తయారీ యూనిట్‌ను నెలకొల్పడానికి సన్నద్ధమైంది. ఇందుకు ఆంధ్రా, తమిళనాడులను ఆ కంపెనీ పరిశీలిస్తోంది. 3400 కోట్ల పెట్టుబడితో 500ఎకరాల స్థలంలో ఈ యూనిట్‌ను నెలకొల్పడానికి సన్నద్ధమవుతున్నారు. 2019 నాటికి ఈ యూనిట్ నుండి ఏడాదికి ఆరు లక్షల కార్లను ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం. కాక పోతే ఎక్కడ యూనిట్‌ను స్థాపించాలన్న దానిపై స్పష్టత రాలేదు. తమిళనాడుతో పాటు నెల్లూరు, చిత్తూరు జిల్లాల పరిధిలో వున్న శ్రీసిటీని, నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టు, ఇఫ్కో సెజ్‌లను కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కృష్ణపట్నం పోర్టులో రవాణా పరంగా అన్ని వసతులున్నప్పటికి ఇక్కడున్నవి ఎక్కువగా ఇసుక భూములు కావడంతో అంతగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. శ్రీసిటీ లేదా ఇఫ్కో సెజ్ అయినా కూడా అన్నింటికీ అనుకూలమే! రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటే ఈ కంపెనీని తమిళనాడుకు తరలిపోకుండా ఆంధ్రాకు అది కూడా నెల్లూరుజిల్లాకు తీసుకురావడం కష్టమేమీ కాదు.

# ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛభారత్






ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛభారత్ కార్యక్రమం విజయవంతం కాగలదని, ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై తమ వీధులను, గ్రామాలను, ప్రాంతాలను, పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దు కోవాలని కేంద్ర పట్టణాభివృద్ధి మరియు సమాచార ప్రసారాల శాఖ మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. ఈ నెల 6వ తేదీన ఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా స్వచ్ఛసర్వేక్షన్ – 2017 బ్రోచర్‌ను, హెల్ప్‌లైన్ 1969 నెంబర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ నగరాలు, పట్టణాలు, గ్రామాలలో స్వచ్ఛభారత్ మిషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పాలకవర్గాలు ప్రణాళిక పరంగా దీనిని అమలు చేయాలన్నారు. 2017 మార్చికల్లా గుజరాత్, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాలను బహిరంగ మలవిసర్జన రహిత రాష్ట్రాలుగా రూపొందించాలన్నదే లక్ష్యమన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సందేశం విన్న అనంతరం ఆయన సూచనలపై జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు వెంటనే స్పందించారు. కార్పోరేషన్ అధికారులు, మున్సిపల్ అధికారులతో చర్చించి స్వచ్ఛభారత్‌పై ప్రజలలో అవగాహన పెంచాలన్నారు.

ఈ సమావేశంలో మేయర్ అబ్దుల్ అజీజ్, కమిషనర్ వెంకటేశ్వర్లు, కావలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ అలేఖ్య, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com